
Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 13.06.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 02 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## సమస్యలతో సవారి



సవాళ్లు, సమస్యల మధ్య నవ్యాంధ్ర తొలి ముఖ్యమంత్రిగా ఈ నెల 8న చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవం అంగరంగ వైభవంగా జరిగిపోయింది. గుంటూరులో ప్రమాణస్వీకారోత్సవ వేడుకను కోటప్పకొండ జాతర మాదిరిగా నిర్వహించారు. ఇంతవరకు బాగానే వుంది. ప్రమాణస్వీకారం జరిగిన వెంటనే చంద్రబాబు ఐదు వాగ్ధానాల ఫైళ్లపై సంతకాలు పెట్టేసారు. వీటిలో అతిముఖ్యమైనది రుణమాఫీ. ఇప్పుడు అదే రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారబోతుంది. రుణమాఫీని పూర్తిగా రద్దు చేస్తూ చంద్రబాబు సంతకం పెట్టలేదు. దీని విధివిధానాలను పరిశీలించి ఒక నివేదిక రూపొందించేందుకే ఆయన సంతకం చేసారు. ఈ కమిటీకి నాబార్డ్ ఛైర్మెన్ కోటయ్యను అధ్యక్షుడిగా నియమించారు. నిన్నటి ఎన్నికల్లో అధికారంపై పెద్దగా ఆశలులేని చంద్రబాబు అధికారాన్ని చేజిక్కించుకోవడానికి, అధికారం నూరుశాతం గ్యారంటీ అనుకున్న జగన్ అధికారంలోకి రాకపోవడానికి ప్రధాన కారణం రుణ మాఫీ. చంద్రబాబు అనుభవానికి, జగన్ అనుభవ రాహిత్యానికి తేడా కనిపించింది రుణమాఫీ హామీ విషయంలోనే! ప్రజల నుండి ఓట్లు రాబట్టే ఏ ఒక్క మార్గాన్ని కూడా చంద్రబాబు ఈ ఎన్నికల్లో వదులుకోలేదు. (మిగతా 10వ పేజీలో)

## అటు... ఇటు...
# వెంకయ్య తంత్రం | నారాయణ మంత్రం




### జిల్లా ప్రగతికి ఇదే మంచి తరుణం



- కేంద్ర నగరాభివృద్ధి మంత్రిగా వెంకయ్య
- రాష్ట్ర పురపాలక మంత్రిగా నారాయణ

**జిల్లాకు ఇది బాగా అచ్చివస్తున్న కాలమా అనిపిస్తోంది. దేశంలో చకచకా జరిగిపోతున్న పరిణామాల్లో ప్రధానిగా నరేంద్రమోడీ పరిపాలన ఒక నవశకంగా ప్రారంభం కావడం ఒక సంతోషమైతే, ఆయన మంత్రివర్గంలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి జాతీయనేత ముప్పవరపు వెంకయ్యానాయుడికి చోటు దక్కడం మరో ఆనందం. జిల్లా ప్రగతికి అటు ప్రధాని నరేంద్రమోడీ ఆశీస్సులు, వెంకయ్య అండదండలు వుంటాయని అందరూ ఆనందిస్తున్న తరుణంలో, మరోవైపు రాష్ట్రంలో చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడంతో, సీమాంధ్ర ప్రజలకు అభివృద్ధిపై మరింత భరోసా కలిగింది. ఇప్పుడు తాజాగా నెల్లూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నారాయణ విద్యాసంస్థల అధినేత పి.నారాయణకు రాష్ట్ర పురపాలక మంత్రిపదవి లభించడంతో జిల్లా అభ్యున్నతికి మార్గం మరింత సుగమమైనట్లేనని అందరూ ఆనందిస్తున్నారు.**

నారాయణ ప్రజల కష్టసుఖాలు తెలిసిన మంచి వ్యక్తి. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన నారాయణ, ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగారు. విద్యార్థి దశ నుంచి కష్టపడి చదువుకుని యూనివర్శిటీలో గోల్డ్‌మెడల్ సాధించారు. నెల్లూరులో ఒక చిన్న కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించి, ఎంతో శ్రద్ధతో, దీక్షతో విద్యాసంస్థలను స్థాపించి వాటి అభివృద్ధికి ఆయన అహరహం కృషి చేశారు. ఎందరో విద్యార్థులకు మంచి భవితను చేకూర్చారు. కష్టేఫలీ అన్నట్లు అంచలంచలుగా ఎదుగుతూ, నేడు రాష్ట్రవ్యాప్తంగానే కాక, దేశవ్యాప్తంగా మూడువందలకు పైగానే విద్యాసంస్థలను స్థాపించి, విద్యారంగంలో 'నారాయణ' బావుటాను ఎగురవేశారు. నారాయణ విద్యాసంస్థల్లో లక్షలాదిమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఆ సంస్థల్లో వేలాదిమంది ప్రతిభ కలిగిన అధ్యాపకులు, సిబ్బంది వున్నారు. ఎంతో విశిష్టమైన ఈ విద్యాసంస్థలకు అధిపతిగా వున్న నారాయణకు రాష్ట్ర పురపాలక మంత్రి పదవి రావడం ఇక్కడి ప్రజలకు ఎంతో సంతోషకరం. దీంతో జిల్లాకు, ప్రత్యేకించి నెల్లూరు నగరాభివృద్ధికీ మరో మంచి అవకాశం వచ్చినట్లయింది. ఇప్పుడు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు నాయకులు..ఒకరు బిజెపి జాతీయనేత, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ముప్పవరపు వెంకయ్యానాయుడు, మరొకరు నారాయణ.. ఈ ఇద్దరూ ఈ జిల్లాపై మంచి అవగాహన కలిగినవారు కావడంతో, జిల్లా పురోభివృద్ధికి వీరు గట్టి కృషిచేస్తారని అందరి విశ్వాసం. తొలి నుంచీ అటు పార్టీలోనూ, ఇటు పదవి వున్నా లేకున్నా ప్రజలకు తన వంతు సేవ చేయాలనే కర్తవ్యంతో, అంకితభావంతో ముందుకు సాగుతున్న సహృదయనేత వెంకయ్యానాయుడు. అసెంబ్లీ టైగర్‌గా ప్రసిద్ధిగాంచి, సింహపురి సీమ వాణిని అసెంబ్లీలో ఘనంగా వినిపింపజేసి, ఎన్నో ప్రజా సమస్యలకు ఆయన గతంలో పరిష్కారం చూపారు. అద్భుతమైన వాగ్ధాటితో, వాక్చాతుర్యంతో రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగారు. ఎదుటివారిని మెప్పించి, (మిగతా 10వ పేజీలో)



# 'పవర్' మహిమా!



### నందమూరికి తగ్గిన ప్రాధాన్యత

- బంధువులు దూరంగా.. ఆత్మబంధువు దగ్గరగా...
- పవన్‌పై పెరిగిన అభిమానం

**రాజకీయ అవసరాలు దగ్గరి వారిని దూరం చేస్తుంటాయి. దూరం వారిని దగ్గర చేస్తుంటాయి. రాష్ట్రంలో ఐదేళ్ల కాలంలో సంభవించిన పరిణామాలను చూస్తుంటే చాలా ఆశ్చర్యమేస్తుంది. ఐదేళ్ల క్రితం తెలుగుదేశం మా పార్టీ, ఎన్టీఆర్ మా తాతయ్య, చంద్రబాబు మా మామయ్య అంటూ రాష్ట్రం నలుమూలలా తిరిగిన జూనియర్ ఎన్టీఆర్ ఈరోజు చంద్రబాబుకు కానివాడయ్యాడు. అదే అయిదేళ్ల క్రితం చంద్రబాబును తూర్పారబడుతూ ప్రజారాజ్యం పార్టీని స్థాపించిన తన అన్న చిరంజీవికి మద్దతుగా ప్రచారం చేసిన పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ మాత్రం ఈరోజు చంద్రబాబుకు ఆత్మబంధువయ్యాడు.**

ఇప్పుడు చంద్రబాబు పవన్ కల్యాణ్‌కు ఇస్తున్నంత ప్రాధాన్యత నందమూరి కుటుంబంలో ఏ ఒక్కరికీ ఇవ్వడం లేదు. చంద్రబాబుకు రాజకీయంగా కొన్ని లెక్కలుంటాయి. ఆ లెక్కలనుబట్టే ఆయన మనుషులను అంచనా వేస్తుంటాడు. 2009 ఎన్నికల్లో జూనియర్ ఎన్టీఆర్ రాష్ట్రమంతా ప్రచారం చేసాడు. నేరుగా వై.యస్.పైనే విమర్శలు చేశాడు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి రాలేదు. నందమూరి కుటుంబంలో ఇప్పుడు గ్లామర్ వున్నది జూనియర్‌కే! అయినా ఈ ఎన్నికలలో ప్రచారానికి రమ్మని అతనిని ఎవరూ పిలవలేదు. పిలవని పేరంటానికెందుకని జూనియర్ కూడా వెళ్లలేదు. ఇక్కడ చంద్రబాబు లెక్క ఒక్కటే... జూనియర్ వచ్చి ప్రచారం చేసినా చేయకపోయినా వచ్చేవి అవే ఓట్లు. ఎన్టీఆర్ అభిమానులు తెలుగుదేశంకే ఓట్లేస్తారుగాని జగన్‌కు వేయలేరుగా! ఇవన్నీ కులాభిమానంతో, ఎన్టీఆర్ అభిమానంతో వచ్చే ఓట్లు. కాబట్టి పక్కకు పోవు. అదే పవన్ కల్యాణ్‌ను ప్రచారంలోకి దింపితే రాష్ట్రంలో బలంగా వున్న కాపు సామాజికవర్గం ఓట్లు పొందవచ్చునుకున్నాడు. అదేపని చేసాడు. ఆ విధంగా ఓట్ల ప్రయోజనం పొందాడు. తెలుగుదేశం అధికారంలోకి రావడానికి పవన్ పాత్ర ఉండబట్టే మొన్న ప్రమాణస్వీకారోత్సవంలోనూ ఆయనకు ఎనలేని ప్రాధాన్యతనిచ్చారు. ఇక్కడ పవన్‌కు అడుగడుగునా హారతిపడితే, నందమూరి హరికృష్ణను, ఆయన కొడుకులు జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్‌లను పట్టించుకున్న వాళ్లు లేరు.

## దూకుడుకు ముకుతాడు



కేసీఆర్‌ను చూస్తే సీమాంధ్రులకు ఓ పక్క బాధేస్తుంది, ఇంకోపక్క ఇలాంటి నాయకుడు మనకుంటే ఎంత బాగుండేది అనిపిస్తుంది. వాళ్లు పక్కా ప్రాంతీయవాదంతో వ్యవహరిస్తున్నారు. నిజంగా చెప్పాలంటే సీమాంధ్ర కోసం పక్కాగా పోరాడే అలాంటి నాయకుడు మనకు ఒక్కరూ లేరు. సీమాంధ్రలో వున్న నాయకులందరిదీ కూడా రెండు కళ్లు, రెండు కాళ్ల సిద్ధాంతమే. చంద్రబాబు సీమాంధ్రతో పాటు తెలంగాణలో పార్టీని దృష్టిలో పెట్టుకుని బ్యాలెన్స్‌డ్‌గా వ్యవహరిస్తున్నాడు. జగన్ కూడా తెలంగాణలో పార్టీని డెవలప్ చేసుకోవాలని చెప్పి రెండు ప్రాంతాలపై సమదృష్టితో వున్నాడు. ఇక కాంగ్రెస్ నాయకుల సంగతైతే చెప్పనవసరం లేదు.

కాని తెలంగాణలో కేసీఆర్ వీరిలా కాదు, సీమాంధ్రవాళ్లు ఎక్కడైనా చావనియ్యండి, నా తెలంగాణ అభివృద్ధే (వివరాలు 10వ పేజీలో)

# అమాత్య ఆశలు గల్లంతు






చంద్రబాబు మంత్రివర్గంలో జిల్లా నుండి నారాయణ విద్యాసంస్థల అధినేత పి.నారాయణకు చోటు దక్కడంతో జిల్లాలో మిగిలిన నాయకుల ఆశలు గల్లంత య్యాయి. నారాయణకు మొదట ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తారనుకున్నారు. చివరకు మంత్రిగా ఆయనను తీసుకు న్నారు. చంద్రబాబును తిరిగి అధికారం లోకి తీసుకురావడంలో నారాయణ చేసిన కృషి అంతా ఇంతా కాదు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన రోజు నుండీ డిప్యూటీ సీఎంగా నారాయణ పేరు జోరుగా ప్రచారంలో వుంది. అయితే ఆయనను ఉత్తరాంధ్రజిల్లాల కోటా నుండి డిప్యూటీ సీఎంగా తీసుకుంటారని భావిస్తూ వచ్చారు. ఆయన కోణంలో నుండి కాకుండా జిల్లాలో పార్టీ పరంగా చూస్తే మొన్న ఎన్నికల్లో ఓడిపోయిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో పాటు గెలిచిన ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొల్లినేని రామారావులు కూడా మంత్రి పదవిపై మోజుపడ్డారు. తాను సీనియర్‌ను కాబట్టి, పదేళ్లుగా ప్రతిపక్షంలో వుండి కూడా పార్టీ తరపున పోరాడాను కాబట్టి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించైనా తనను మంత్రివర్గంలోకి తీసుకుంటారని సోమిరెడ్డి ఆశించారు. జిల్లాలో పార్టీ కార్యకర్తలకు గాని ప్రజలకు గాని అందుబాటులో ఉండే నాయకుడు సోమిరెడ్డి. మొన్న సర్వేపల్లి నుండి గెలిచి వుంటే ఖచ్చితంగా ఇప్పుడు మంత్రి అయ్యుండే వాడు. కాని ఓడిపోవడంతో మంత్రి ఆశ నెరవేరకుండా పోయింది. తొలివిడతలో కాకపోయినా తర్వాతయినా తనను మంత్రివర్గంలోకి తీసుకుంటారనే నమ్మకం సోమిరెడ్డిలో ఉంది.

జిల్లాలో సోమిరెడ్డి, బీద, పరసా వంటి సీనియర్లు ఓడిపోయారు కాబట్టి రెండోసారి గెలిచిన తనకు మంత్రి పదవి వస్తుందేమోనని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆశపడ్డాడు. ఉన్న ముగ్గురు పార్టీ ఎమ్మెల్యేలలో రెండోసారి గెలిచింది ఆయనే! కాబట్టే ఆ దిశగా ఆశ పెట్టుకున్నాడు. ఇక 'రెడ్డి' వర్గం ఎమ్మెల్యేలు తక్కువగా ఉన్నారు కాబట్టి ఆ సామాజిక వర్గం కోటాలో తనకు అవకాశం రావచ్చని కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రయత్నించారు. ఇక మెట్ట ప్రాంతానికి ప్రాధాన్యత కల్పించాలనుకుంటే తనకు మంత్రి యోగం దక్కొచ్చని ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు ఆశపడ్డారు.

అయితే ఎలక్షన్లు, ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా నారాయణకు మంత్రి పదవి ఇవ్వడం, తర్వాత జరిగే విస్తరణలోనైనా జిల్లాకు రెండో మంత్రి పదవి వచ్చే అవకాశం లేకపోవడంతో వీరు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.



# ఓడినా ఆనంకు హ్యాపీయే!

మొన్నటి ఎన్నికల్లో ఆనం కుటుంబం ఓడినా తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చినందుకు వారికేం పెద్దగా వచ్చే ఇబ్బందేమీ లేదనిపిస్తుంది. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిఉంటే వారికి కొంచెం తలనొప్పిగానే ఉండేదికాని, తెలుగుదేశం అధికారంలోకి రావడం వారికి మంచిదే అయ్యింది.

సీమాంధ్రలో కాంగ్రెస్ చావుదెబ్బతింటుందని అందరూ ఊహించిందే! కాంగ్రెస్‌కు ఇంతటి వ్యతిరేకత వున్న ఎన్నికల్లో తాము గెలుస్తామని ఆనం కుటుంబం ఆశించలేదు. ఈ ఎన్నికల్లో వారి కుటుంబం నుండి నలుగురు పోటీ చేశారు. ముగ్గురు కాంగ్రెస్ తరపున, ఒకరు మాత్రం వారితో విడిపోయి జైసమైక్యాంధ్ర తరపున పోటీ చేయడం జరిగింది. ఎన్నికలకు ముందే ఆనం సోదరులకు తెలుగుదేశంలోకి రమ్మని ఆహ్వానం పంపాడు చంద్రబాబు. అయితే కాంగ్రెస్‌లో నెంబర్ వన్ పొజిషన్‌లో ఉన్నప్పుడు దీనిని వదులుకుని పోవడమెందుకులే అని వాళ్లు కాంగ్రెస్‌లోనే ఉండిపోయారు.

అయితే ఆనం వివేకా గాని, రామనారాయణరెడ్డి గాని గత ప్రభుత్వ కాలంలో వై.యస్.జగన్ మీద విరుచుకుపడ్డారేగాని తెలుగుదేశం మీద గాని, చంద్రబాబునాయుడు మీద గాని పెద్దగా రాజకీయ దాడికి దిగలేదు. జగన్‌ను లక్ష్యంగా చేసుకునే వారు తీవ్రమైన విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఇంకే నాయకుడు మాట్లాడనంత కటువుగా వాళ్లిద్దరూ జగన్ గురించి మాట్లాడారు.

ఈ సమయంలో జగన్ అధికారంలోకి వచ్చివుంటే ఆనం సోదరులను రాజకీయంగా టార్గెట్ చేసుకుని ఉండేవాడు. జగన్ అధికారంలోకి రాకపోవడంతో వీళ్ల పని హాయిగా ఉంది.

అదీగాక తెలుగుదేశంలో సోమిరెడ్డి, ఆదాల వంటి ముఖ్యనాయకులు ఓడిపోయారు. ఆనం సోదరులకు వారికి పెద్ద తేడా లేదు. ఆనం సోదరులకు చంద్రబాబు వద్ద పరపతి ఉంది. వారి మాటకు విలువ ఉంది. జిల్లాలోని తెలుగుదేశం నాయకులందరితో కూడా సత్సంబంధాలున్నాయి. కాబట్టి వారికి ఏ పార్టీలో వున్నా ఒకటే!

# ఇక పదవుల కోసం పరుగు







తెలుగుతమ్ముళ్ళు పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉన్నారు. ఈ పదేళ్లలో ఖర్చులు తప్ప ఆదాయం లేదు. ఒట్టిపోయిన గేదెల్లా అయ్యారు. ఈసారి తెలుగుదేశం అధికారంలోకి రాకపోయి ఉంటే వీళ్లు పలాయనం చిత్తగించేవాళ్లు. ఎవరిదారి వాళ్లు చూసుకునేవాళ్లు. ఇప్పుడు పార్టీ అధికారంలోకి రావడంతో తెలుగుతమ్ముళ్లకు ఊపిరొచ్చినట్లయ్యింది.

ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణస్వీకారం అనే తొలి అంకం ముగిసింది. ఇక ఇప్పుడు అందరిదృష్టి కూడా నామినేటెడ్ పదవుల మీద పడుతోంది. మొన్న ఎన్నికల్లో సీట్లు రానివాళ్లు, సీట్లు తెచ్చుకుని ఓడిపోయినవాళ్లు, ప్రతి ఎన్నికలలోనూ పార్టీ కోసం చెమటోడుస్తున్న నాయకులు... ఇలా అందరూ నామినేటెడ్ పదవుల వైపు దృష్టి సారిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో కొన్ని నామినేటెడ్ పదవులుంటాయి. ఎస్ఎఫ్‌సి ఛైర్మెన్, ఆర్టీసీ ఛైర్మెన్, హౌసింగ్‌బోర్డ్ ఛైర్మెన్, ఇంకా పలు కార్పొరేషన్‌ల డైరక్టర్ల పోస్టులున్నాయి. వీటిలో కొన్ని కార్పొరేషన్ల ఛైర్మెన్ పదవులకు కేబినెట్ హోదా ఉంటుంది. ఇక జిల్లా స్థాయిలోనూ కొన్ని నామినేటెడ్ పదవులున్నాయి. ఆర్టీసీ రీజియన్ ఛైర్మెన్ పదవితో పాటూ ఆయా దేవస్థానాల పాలకమండళ్లు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలు ఉన్నాయి. ఈ పదవులను దక్కించుకునే దిశగా తెలుగుతమ్ముళ్లు ఇప్పటి నుండే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

# ఐదేళ్ల దాకా ప్రశాంతం

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసింది. కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు కూడా ఏర్పడ్డాయి. న్యాయస్థానాల పుణ్యమా అని మున్సిపాల్టీలకు, జడ్పీలకు కూడా ఎన్నికలు జరిగిపోయాయి. కేవలం ఇక జడ్పీ ఛైర్మెన్‌లు, ఎంపీపీలు, మేయర్‌లు, ఛైర్మెన్‌ల ఎన్నికే మిగిలివుంది. ఈ నెలలోనే వాటి ఎన్నికలు ముగిసిపోవచ్చు.

ఇక ఐదేళ్ల దాకా మనం ఎన్నికల సంగతిని మరచిపోవచ్చు. 2019జనవరి నెల దాకా ఇక రాష్ట్రంలో ఎన్నికల ఊసంటూ ఉండదు. మధ్యమధ్యలో పంచాయితీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ ఎన్నికలు రావడం, ఎన్నికల కోడ్‌లు అమలులోకి తేవడం, అభివృద్ధి పనులన్నీ ఆగిపోవడం అంటూ ఉండదు. ఐదేళ్లు హ్యాపీగా పనిచేసుకోవచ్చు. మధ్యలో ఏ ఆటంకమూ ఉండదు. ఎన్నికల జాతరలు అసలు ఉండవు. ఐదేళ్ల దాకా ఇక ప్రశాంతమే!

# కాంగ్రెస్ ఖాళీనే

రాష్ట్ర విభజనతోనే సీమాంధ్రలో కాంగ్రెస్‌పార్టీ ఉనికి నామమాత్రంగా మిగిలిపోయింది. మొన్న ఎన్నికల్లో చూస్తే ఒక్క పార్లమెంటుసీటు గాని, ఒక్క అసెంబ్లీ సీటు గాని ఆ పార్టీ అభ్యర్థులు గెలవలేకపోయారు. అంతెందుకు సీమాంధ్ర మొత్తం మీద కాంగ్రెస్‌కు గట్టిగా నాలుగు జడ్పీటీసీలు కూడా రాలేదు. ఎన్నికలప్పుడు ఈ పరిస్థితి ఉంది. ఇక ఎన్నికలు అయిపోయాయి. ఐదేళ్ల దాకా ఇక రాజకీయాలు, ఎన్నికల ప్రస్తావనే లేదు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ నాయకులంతా కూడా క్యూకట్టిమరీ తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌లలో చేరిపోయారు. ఎన్నికల తర్వాత అరకొర మిగిలివున్న కాంగ్రెస్ నాయకులు కూడా ఇప్పుడు ఆ పార్టీలో నిలిచే పరిస్థితులు లేవు.

మొన్న ఎన్నికలలో జిల్లాలో కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోయింది. మున్సిపల్, జడ్పీటీసీ, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోయింది. జిల్లాలోని 10అసెంబ్లీలో గాని, నెల్లూరు లోక్‌సభలో గాని కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులకు ఏ ఒక్క చోటా డిపాజిట్ దక్కలేదు. జిల్లా కాంగ్రెస్‌పార్టీని తమ భుజాలపై మోసిన ఆనం కుటుంబం నుండి ఆ పార్టీ అభ్యర్థులుగా ముగ్గురు పోటీచేస్తే వారికీ డిపాజిట్లు రాలేదు. ఈ ఎన్నికల ఫలితాలు చూశాక ఎవరికైనా సరే, ఇక కాంగ్రెస్‌లో ఉండడం అవసరమా అనే సందేహం వస్తుంది. ఇంకో ఐదేళ్ల దాకా కాంగ్రెస్‌ను గురించి ఆలోచించాల్సిన పనిలేదు. ఐదేళ్ల తర్వాత కూడా కాంగ్రెస్‌కు అంత సీన్ రాకపోవచ్చు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అన్నది ముగిసిన అధ్యాయమే అనుకోవచ్చు. కాంగ్రెస్ ఎలాగూ చచ్చిన శవమైంది కాబట్టి ఇక ఆ పార్టీలో మిగిలినవాళ్లు కూడా తెలుగుదేశం లేదంటే వైకాపాలోకి సర్దుకునే అవకాశముంది.



## సంచలన విజయాలకు కేరాఫ్...

# పోలంరెడ్డి

***ఎంతసేపటి నుండి పరుగెడుతున్నాము అన్నది కాదు, ఎంత వేగంగా పరుగెడుతున్నామన్నది గెలుపుకు మూలసూత్రం. పోకిరి సినిమాలో మహేష్‌బాబు డైలాగ్ తెలియని వాళ్లుండరు... ఎప్పుడొచ్చామన్నది ముఖ్యం కాదన్నయ్యా... బుల్లెట్ దిగిందా లేదా... అన్నదే ముఖ్యం అని అంటాడు. అలాగే రాజకీయాల్లోకి ఎప్పుడొచ్చాం... పార్టీలోకి ఎప్పుడొచ్చాం.. పోటీలోకి ఎప్పుడొచ్చాం అన్నది ముఖ్యం కాదు. గెలిచామా... లేదా అన్నదే ముఖ్యం. దీనికి సరిగ్గా సరిపోతాడు కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి.***

2014 అసెంబ్లీ ఎన్నికల్లో కోవూరు తెలుగుదేశం అభ్యర్థిగా అనూహ్యంగా విజయం సాధించాడు. కోవూరులో తిరుగులేదనుకున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని మట్టికరిపించాడు. పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి రాజకీయ ప్రయాణం మొదలైంతే తెలుగుదేశం పార్టీలో! 2001లో జరిగిన జడ్పీ ఎన్నికల్లో ఆయన మనుబోలు జడ్పీటీసీ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2004లో రాపూరు తెలుగుదేశం సీటు కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ఈ సీటు విషయంలో అప్పట్లో పోలం రెడ్డికి ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం కూడా జరిగింది. ఆ ఎన్నికల్లో రాపూరు సీటు ఎల్లసిరికి ఖరారైంది. ఈ తరుణంలోనే కాంగ్రెస్ నాయకులు, ముఖ్యంగా నేదురుమల్లి వర్గం పోలంరెడ్డికి గాలం వేసింది. ఆయనను కాంగ్రెస్‌లోకి లాగేశారు. ఎన్నికలకు నెలరోజుల ముందు ఆయన కాంగ్రెస్‌లో చేరారు. కోవూరు కాంగ్రెస్ అభ్యర్థి అయ్యాడు. పోలంరెడ్డి పార్టీలో చేరేనాటికి కోవూరులో తెలుగుదేశం అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరిస్థితి ఏంటంటే... కుప్పంలో చంద్రబాబు తర్వాత తెలుగుదేశం గెలిచే రెండోసీటు కోవూరు అన్నట్లుగా ఉండింది. ప్రసన్న అయితే కనీసం 30వేల మెజార్టీతో గెలుస్తాననే ధీమాలో ఉండిపోయాడు. కాని పోలంరెడ్డి కేవలం నెలరోజుల్లోనే అక్కడి రాజకీయ స్వరూపాన్ని మార్చిపడేశాడు. ప్రసన్న అనుచరగణాన్నంతా తన వైపుకు లాక్కున్నాడు. ప్రసన్న కంచుకోటను బద్దలుకొట్టాడు. ప్రసన్న మీద 400చిల్లర ఓట్ల తేడాతో గెలిచాడు. ఆ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనాత్మకమైంది పోలంరెడ్డి గెలుపే! కోవూరు ఎమ్మెల్యేగా ఐదేళ్లు సమర్థవంతంగానే పనిచేసినా కొన్ని స్వయంకృతాపరాధాల వల్ల 2009లో ఓడిపోయాడు. 2011లో జరిగిన కోవూరు ఉపఎన్నికల్లో కూడా ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి మూడోస్థానంలో నిలిచారు.

రాష్ట్ర విభజనతో రాష్ట్రంలో కాంగ్రెస్ ఎత్తిపోయింది. దీంతో కొందరు తెలుగుదేశం నాయకుల ప్రోత్సాహంతో పోలంరెడ్డి తిరిగి తెలుగుదేశంలోకి రావడం, వెనువెంటనే సీటు ఖరారు కావడం జరిగాయి. మళ్ళీ 2004లో ఎలాగైతే ఎలక్షన్ చేశాడో, ఇప్పుడు కూడా ఆయన ఆ తరహాలోనే పని చేశాడు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకున్నాడు. దూరమైన వాళ్లను దగ్గర చేసుకున్నాడు. ప్రసన్నపై మరోసారి సంచలన విజయాన్ని నమోదుచేసి చంద్రబాబు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు.

# రాజ్యసభ లేనట్లేనా?

- ఒక సీటు కోసం ఎంతోమంది పోటీ
- దేశం కోటలో వున్న రాజ్యసభను బీజేపీకిచ్చే అవకాశం





జిల్లాకు చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు, పెద్దాయన నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మృతి చెందడంతో రాష్ట్రం నుండి ఒక రాజ్యసభ స్థానం ఖాళీ కావడం తెలిసిందే! ఈ రాజ్యసభ స్థానానికి త్వరలోనే నోటిఫికేషన్ వెలువడనుంది. సీమాంధ్ర కోటాలోకి వచ్చిన ఈ రాజ్యసీటు ఖచ్చితంగా తెలుగుదేశంకే దక్కుతుంది.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సమీకరణాలు మారడం తెలిసిందే! అయితే ఖాళీ అయిన ఈ రాజ్యసభపై పలువురు నాయకులు మనసు పడుతున్నారు. నెల్లూరు లోక్‌సభ నుండి పోటీచేసి కొద్దిపాటి తేడాతో ఓడిపోయిన ఆదాల ప్రభాకర్ రెడ్డితో పాటు బీద రవిచంద్ర, పయ్యావుల కేశవ్, ఒంగోలు లోక్‌సభ నుండి ఓడిపోయిన మాగుంట శ్రీనివాసులురెడ్డి కూడా ఈ సీటును ఆశిస్తున్నారు.

అయితే చంద్రబాబు మాత్రం ఈ ఒక్క రాజ్యసభ స్థానాన్ని బీజేపీకి ఇవ్వడానికి అంగీకరించారని తెలుస్తుంది. మొన్న ఎన్నికల్లో ఒప్పందం మేరకు ఓ నాలుగు అసెంబ్లీ సీట్లను బీజేపీకి తగ్గించి ఇచ్చారు. వీటికి ప్రత్యామ్నాయంగా రాజ్యసభ లేదా ఎమ్మెల్సీలు ఇస్తామని చంద్రబాబు అప్పుడే బీజేపీ నాయకులకు హామీ ఇచ్చాడు. ఇప్పుడు చూస్తే రాజ్యసభ అవకాశమొచ్చింది. తెలుగుదేశంలో చూస్తే ఒక పదవి కోసం పదిమంది నాయకులు ఎదురుచూస్తున్నారు. ఒకరికి ఇస్తే మిగిలిన వాళ్లు అసంతృప్తికి గురవుతారు. ఈ తలనొప్పి లేకుండా బీజేపీకివ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తుతం ఏ సభలోనూ సభ్యులుగా లేరు. ఆమెను రాజ్యసభకు ఎన్నుకోవాల్సి వుంది. ఎలాగూ ఆమె ఆంధ్రప్రదేశ్ కోడలే! కాబట్టి నేదురుమల్లి మృతితో ఖాళీ అయిన సీటును ఆమెకే కేటాయిస్తారని సమాచారం.

# అథ్లెటిక్స్ ఉపాధ్యక్షుడిగా నందకిషోర్



ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వై.కె.నందకిషోర్‌ను ఎన్నుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పూడి నరేంద్రరావు, అరిగెల ప్రభాకర్‌రావులు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రస్తుతం అసోసియేషన్‌కు జిల్లా ఛైర్మెన్‌గా వ్యవహరిస్తున్న నందకిషోర్‌ను రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

- మున్సిపల్ మంత్రికి తొలిసవాల్...

# నెల్లూరు కార్పొరేషన్‌పై 'దేశం' జెండా ఎగిరేనా?



నెల్లూరుజిల్లాకు చెందిన పి.నారాయణ మున్సిపల్‌శాఖ మంత్రి అయ్యారు. ఇప్పుడు ఆయన సమర్ధతకు తొలిసవాల్ నెల్లూరు కార్పొరేషన్ నుండే ఎదురుకాబోతుంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశంకు అనుకూల ఫలితాలే వచ్చాయి. కార్పొరేషన్‌లలో చూస్తే కడప, కర్నూలు, నెల్లూరులలో తప్పితే మిగతా కార్పొరేషన్‌లను తెలుగుదేశమే కైవసం చేసుకుంది. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాతే ఆయా కార్పొరేషన్లు, మున్సిపాల్టీలలో మేయర్‌లు, ఛైర్మెన్‌ల ఎన్నిక ఉంటుందని ఎన్నికల సంఘం ప్రకటిం చింది. దీంతో కొత్తగా వచ్చే ప్రభుత్వ ప్రభావం మేయర్, ఛైర్మెన్‌ల ఎన్నికపై తప్పకుండా వుంటుందని ఊహించారు. ఇప్పుడు అనుకున్నట్లే జరుగుతుంది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో ఆ ప్రభావం నగరపాలక సంస్థలు, మున్సిపాల్టీలపై బాగానే పడుతుంది. ఇంకో ఐదేళ్ల దాకా ఎన్నికల గురించి ఆలోచిం చాల్సిన అవసరమే లేకపోవడంతో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరపున గెలిచిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కూడా అధికారపార్టీ వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తుంది. అధికార పార్టీలో ఉంటే ఓడినవాళ్లు కూడా అధికారాన్ని చెలాయిస్తారు. అధికారులపై పెత్తనం చేస్తారు. అదే ప్రతిపక్షంలో వుంటే గెలిచిన వాళ్లకు కూడా పెద్దగా పనులు కావు.

ఈ సూత్రం మీదనే నెల్లూరు నగరపాలక సంస్థలోసైతం సమీకరణాలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా జిల్లాకు చెందిన నారాయణ మున్సిపల్ శాఖ మంత్రి కావడంతో సమీకరణలు వేగంగా మారుతున్నట్లు తెలుస్తోంది.

నెల్లూరు నగరపాలక సంస్థకు జరిగిన ఎన్నికల్లో వైకాపా తరపున 32మంది కార్పొరేటర్లు గెలవగా తెలుగుదేశంకు ఒక ఇండిపెండెంట్‌తో సహా 18 మంది వున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు బీజేపీ కార్పొరేటర్లు, ఒక సీపీఎం కార్పొరేటర్ మద్దతు తెలుగుదేశంకే ఉన్నట్లు తెలుస్తుంది. నెల్లూరు మేయర్ పదవిని దక్కించుకోవాలంటే ఇక ఏడుగురు కార్పొరేటర్లు అవసరం. వైకాపా నుండి కొంతమంది కార్పొరేటర్లు తెలుగుదేశంపార్టీలోకి రావడానికి సుముఖంగా వున్నట్లు తెలుస్తోంది. వైకాపాలో ఉంటే ఇక తమ డివిజన్‌లలో అభివృద్ధి పనులు చేయలేమని, ఐదేళ్ల పదవీకాలం నిరుపయోగమవుతుందని వీరి బాధ. ఒకవేళ వైకాపా మేయర్ అభ్యర్థి గెలిచినా అభివృద్ధి పనుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అంతంతమాత్రంగా ఉంటుంది. మేయర్ తమ పార్టీ వాళ్లు కానప్పుడు అధికారపార్టీ నాయకులు తమకు అనుకూలంగా వుండే కమీషనర్‌ను వేయించుకుని అతని ద్వారానే పరిపాలన సాగేలా చేస్తారు.

వైకాపా మేయర్‌కు, కార్పొరేటర్లకు పెద్దగా ప్రాధాన్యత నివ్వరు. దీనికితోడు నెల్లూరుమేయర్ సీటును వైకాపా చేజిక్కించుకుంటే, ప్రభుత్వం ఎప్పటి నుండో పెండింగ్‌లో వున్న 'నుడా' (నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)ని ఏర్పాటుచేసి కార్పొరేషన్ ప్రాధాన్యతను తగ్గించే అవకాశం లేకపోలేదు. నారాయణ మున్సిపల్ మంత్రి అయ్యాడు కాబట్టి ఇప్పుడు 'నుడా'ను ఏర్పాటు చేయడం సులభమే. అప్పుడు నెల్లూరు కార్పొరేషన్‌కు పెద్దపాత్ర ఉండదు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని వైకాపా కార్పొరేటర్లు భవిష్యత్‌లో అభివృద్ధి పనులు, తమ పలుకుబడి, పరపతి దృష్ట్యా తెలుగుదేశంవైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. నెల్లూరు కార్పొరేషన్‌లో తెలుగుదేశం జెండా ఎగిరితేనే ఈ జిల్లాకు చెందిన మున్సిపల్ మంత్రిగా నారాయణ ప్రతిష్ట పెరుగుతుంది.

# సాయి తత్వమంటే మానవత్వం.. ప్రేమతత్వం!

## సాయిదర్బారులో ఘనంగా గీతాజ్ఞానయజ్ఞం

- స్వామి శ్రీ సాయివిశ్వచైతన్య



నెల్లూరులోని బాలాజీనగర్ శివారుల్లో వున్న పద్మావతినగర్‌లో సాయిభక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోన్న శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరం 9వ వార్షికోత్సవం సందర్భంగా, 218వ శ్రీ శిరిడి సాయి గీతాజ్ఞానయజ్ఞ ప్రవచనాలు ఎంతో శోభాయమానంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా, స్వామి శ్రీ సాయివిశ్వచైతన్యగారిచే శ్రీసాయి సచ్చరిత్రపై అద్భుతమైన ప్రవచనాలు జరుగుతున్నాయి. ఈ నెల 9 నుంచి 15వ తేది వరకు జరిగిన ఈ ప్రవచనాలు ఆద్యంతం సాయిభక్తులను భక్తితత్వంలో పరవశింపజేశాయి. ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి 8 గంటల దాకా జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో స్వామి శ్రీ సాయి విశ్వచైతన్య మాట్లాడుతూ, సాయి తత్వాన్ని, మహత్యాన్ని అత్యద్భుతంగా వివరించారు. సాయితత్వమంటే మానవత్వమని, ప్రేమామృతతత్వమని వివరించారు. మనో వికారాలను జయిస్తేనే మనసును స్వాధీనంలో వుంచుకోవచ్చని, మనసు మన ఆధీనంలో వుండాలంటే అందుకు సాయినామస్మరణే శరణమని అన్నారు. సాయినాథుని దివ్యతత్వాన్ని తెలుసుకుంటే సాయిదర్బారులో మనకు చోటు లభిస్తుందన్నారు. భక్తులందరూ నిత్యం సాయినామ స్మరణ చేయాలని, సాయి సచ్చరిత్రలోని కథలను పారాయణం చేయాలని ఆయన ఉద్భోదించారు. ఈ కలియుగంలో మానవుడు సుఖ సంతోషాలతో జీవించాలన్నా, సమస్యల సుడిగుండాల నుంచి బయటపడి ప్రశాంత జీవితం గడపాలన్నా అందుకు గురువును ఆశ్రయించాలని, అయితే సాయిభక్తులకు సమర్ధసద్గురువైన సాయినాథుడే పరమగురువని అంటూ, శరణాగతి తత్వంతో ఆ సద్గురువును ఆశ్రయిస్తే ఎంతో పుణ్యప్రదమని అన్నారు. ఈ కలియుగంలో గురువులకే గురువైన శ్రీ సాయినాథుడే పరమగురువుగా, సద్గురువుగా అవతరించాడన్నారు. గురువు పాదాలను ఆశ్రయిస్తే ఆ జీవితాలకు ఎలాంటి ఇబ్బందులూ వుండవని, అందుకు సాయినాథుని భక్తులంతా నిత్యం సాయిసచ్ఛరిత్రను పారాయణం చేసి, ఆ సద్గురుని ఆశీస్సులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. శ్రీ సాయిదర్బార్ అద్దాల మండపం వ్యవస్థాపకులు మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలన్నీ ఆద్యంతం అద్భుతంగా జరిగాయి. అశేష భక్తజనవాహిని ఈ కార్యక్రమాలకు తరలివచ్చి ఆధ్యాత్మిక ప్రవచనాలను విని స్వామి ఆశీస్సులను అందుకున్నారు. కోవెలలో కొలువైవున్న శ్రీ సాయినాథుని దర్శించుకుని తరించారు.

# ఎంసెట్‌లో పల్లెటూరి వి(రాజి)జేత



2014 ఎంసెట్ ఫలితాలలో వింజమూరులోని నడిమూరుకు చెందిన పి.విరాజిత మెడిసన్ విభాగంలో 237వ ర్యాంకును సాధించింది. ఎంసెట్‌లో 160మార్కులకు గాను విరాజిత 147మార్కులను సాధించింది. ఇంటర్మీడియట్‌లో వెయ్యి మార్కులకు గాను 981మార్కులు తెచ్చుకుంది. విరాజిత ఆత్మకూరులోని సెయింట్ మేరిస్ స్కూల్‌లో 10వ తరగతి చదివి, విజయవాడలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివింది. ఆమె తల్లిదండ్రులు పి.రాఘవరెడ్డి, స్వరాజ్యలక్ష్మిలు కూడా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మెడిసిన్ పూర్తి చేసాక క్యాన్సర్ వైద్యనిపుణురాలిగా ప్రజలకు సేవ చేస్తానని ఈ సందర్భంగా విరాజిత 'లాయర్'కు తెలిపారు.

# కలెక్టర్‌ను కలిసిన కావలి ఎమ్మెల్యే



జిల్లా కలెక్టర్‌తో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



జిల్లా ఎస్పీతో చర్చిస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఈ నెల 10వ తేదీన జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు. కావలి నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి, సాగునీటి సమస్యలను ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కావలి కాలువ పూడిక తీయాలని, పెద్దచెరువుకు నీటిని విడుదల చేసి రైతుల్ని ఆదుకోవాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అలాగే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్‌ను కూడా కలిసి కావలి నియోజకవర్గంలో శాంతిభద్రతల గురించి చర్చించారు.




## ఆర్భాటం అవసరం లేదు

నవ్యాంధ్ర తొలిముఖ్యమంత్రిగా చంద్రబాబు అంత ఆర్భాటంగా ప్రమాణస్వీకారం చేయాల్సిన అవసరం లేదు. ఓ పక్క రాజధాని నిర్మాణానికి విరాళాలివ్వండంటూ జోలెపడుతూ మరోపక్క ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కోట్లు తగ లేయడం ఎంతవరకు సబబు. చంద్రబాబు ఇంతకుముందే రెండు సార్లు ముఖ్యమంత్రిగా చేసాడు. కేసీఆర్ తొలిసారే ముఖ్యమంత్రి అయినా ఆర్భాటానికి పోలేదు. చంద్రబాబు సాదాసీదాగా ప్రమాణం చేసి పాలనపై దృష్టిపెడితే బాగుండేది.

బి.రాజు, కోవూరు.

## సిగ్గొచ్చింది

రాష్ట్ర విభజన ఉసురు కాంగ్రెస్‌కు బాగానే తగిలింది. పూర్తిగా అన్యాయానికి గురైన ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, పూర్తిగా దోచిపెట్టిన తెలంగాణలో కూడా కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు కావడం మంచి పరిణామం. కాంగ్రెస్‌ను చెప్పుతో కొట్టినట్లయ్యింది. బుద్ధున్న నాయకులెవరూ ఇక ఇలాంటి అన్యాయపు విభజన చేయలేరు. సీమాంధ్ర సమస్యలు తీర్చాలంటూ సోనియా కేంద్రానికి లేఖ వ్రాయడం పెద్ద డ్రామా! రాష్ట్రాన్ని విడదీసే రోజు ఆమెకు ఈ బుద్ధి ఏమైందో? ఈ రోజిలా ఆంధ్రప్రదేశ్‌పై ప్రేమ ఒలకబోయడం విడ్డూరంగా వుంది. ఈ బుద్ధి ముందే ఉండుంటే మన రాష్ట్రం ఇలా ముక్కలయ్యేదా? ఏదేమైనా సోనియాకు బుద్ధొచ్చుంటుంది.

పచ్చిపాల మధు, నెల్లూరు.

## సోమిరెడ్డికి న్యాయం చేయాలి

తెలుగుదేశంపార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్లలో పార్టీని వీడకుండా అధికార కాంగ్రెస్‌తో ఒంటరి పోరాటం చేసిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యత కల్పించాలి. వరుసగా నాలుగు పరాజయాలు చవి చూసినా, ధైర్యం వీడకుండా పార్టీ తరపున పోరాడుతున్నాడు. జిల్లాలో పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండే నాయకుడు సోమిరెడ్డే! ఆయనకు న్యాయం చేయాలి.

జి.దీపక్‌రెడ్డి, నెల్లూరు.

## 'ప్రభా'తం

ఎట్టకేలకు ఎన్నెన్నో ఆటుపోట్ల మధ్య, ఆవేదనలూ.. ఆందోళనల మధ్య, అర్థాంతరంగా ఏర్పడిన ఎన్నో అవాంతరాలు.. అస్తవ్యస్త పరిస్థితుల మధ్య..అన్నిటికీ మించి గతంలో ఎప్పుడూ లేని అభద్రతా భావం మధ్య.. రకరకాల సమస్యల సుడిగుండాల మధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సరికొత్తగా ఆవిర్భవించింది. పాత రాష్ట్రం.. పాత పేరే.. అయినప్పటికీ, రాష్ట్రంలో ఇన్నాళ్ళూ కలిసిమెలసివున్న తెలంగాణ విడిపోవడంతో, మిగిలిన 'అవశేషాంధ్రప్రదేశ్'గా ఈ ప్రాంతం ఒంటరిగా.. ఒక అనాథగా మిగలడం అందరికీ ఎంతో బాధను కలిగించింది. అందరిలోనూ ఈ ఆవేదన.. ఆందోళన లోలోన సుళ్ళు తిరుగుతున్న వేళ... 'ఇదిగో నేనున్నా'నంటూ భరోసా ఇస్తూ, ఆశల పల్లకీ మోసుకువచ్చిన అనుభవ నేత చంద్రబాబునాయుడు. నవ్యాంధ్రప్రదేశ్‌కు తొలి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ఈ నెల 8వ తేదిన పదవీప్రమాణం చేయడం రాష్ట్ర చరిత్రలో ఒక చరిత్రాత్మక విషయం. సీమాంధ్రకు నిజంగానే ఇది ఒక గొప్ప వరం. అందుకే, కష్టాల కటిక చీకటి వేళ..చల్లని వెలుగుల చందమామ వెన్నెల వెలుగులు విరజిమ్మినట్లు చంద్రబాబు రాకతో సీమాంధ్రలో ఆనందం పల్లవించింది. ఆ పున్నమిచంద్రుడే నేలకు దిగివచ్చినంత సంతోషం ప్రజల్లో కనిపించింది.. ఆయన ప్రమాణ స్వీకారోత్సవానికి నేల ఈనినట్లు, సముద్రమే పొంగి వచ్చినట్టు పెల్లుబికివచ్చిన ఆ మహా జనప్రవాహాన్ని చూస్తే, అభివృద్ధి ప్రదాతగా చంద్రబాబు ప్రజలను ఎంతగా ఆకట్టుకున్నారో అర్థమవుతుంది. ప్రజల్లో కూడా... తాము పోగొట్టుకున్న అమూల్యమైన వస్తువేదో తిరిగి దొరికినట్లు ఒక ఆనందం.. ఒక భరోసా!.. అందరిలోనూ కనిపించింది. సరిగ్గా సీమాంధ్రకు ఇక్కడ ఒకటికి రెండు సంతోషాలు మేళవించడం ఎంతైనా విశేషం. కమల వికసనానికి దోహదం చేసేది సూర్యుడే. దేశప్రగతికి కంకణం కట్టుకున్న నరేంద్రమోడీ ఒక వైపు అలా.. ప్రభాత సూర్యునిలా ప్రకాశిస్తూవుంటే, మరోవైపు సీమాంధ్రలో 'చంద్రుని' కాంతిపుంజాలు మరింతగా దేదీప్యమానమవుతాయని, ఈ ఇద్దరి నేతృత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని అందరి ఆకాంక్ష. ఏదేమైనా.. ఇంతవరకూ ఒక అధ్యాయం ముగిసింది. అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ నవశకం ఆరంభమైనట్లయింది. ఇక కావాల్సిందల్లా చెప్పిన మాటలు చేతలు కావడం. సరికొత్త చైతన్యంతో ముందుకు సాగడం. మితిమీరిన ఆర్భాటాలకు, అనవసర వ్యయాలకు తిలోదకాలిచ్చి, ఆచరణ సాధ్యమైన క్రొంగొత్త పథకాలతో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు సమాయత్తం కావడం. ఇప్పటికే నరేంద్రమోడీ ప్రగతి పరుగును ప్రారంభించారు. ఆయన ప్రతి మాటా, ప్రతి చేతా ఎంతో మార్గదర్శకంగా, ఆదర్శవంతంగా, ప్రజలందరికీ ఆమోదయోగ్యంగా, ఆనందదాయకంగా వుంటున్నాయి. రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఇప్పుడున్న క్లిష్ట, సంక్లిష్ట పరిస్థితుల్లో ప్రజల భవిష్యత్తుకు మార్గం వేయడమంటే చిన్న విషయమేమీ కాదు.. అసలే, కాంగ్రెస్ పాలనలో ఆర్థిక వ్యవస్థతో పాటు, అన్ని రకాల వ్యవస్థలూ అస్తవ్యస్తమైపోయిన నేపథ్యంలో, ఎక్కడ చూసినా అవినీతి అక్రమాలు పేట్రేగిపోయి.. స్వార్థమే సర్వాంతర్యామి అవుతున్న వేళ..సామాన్యప్రజల జీవితం అత్యంత దుర్భరంగా.. దయనీయంగా మారుతున్న వేళ..ప్రభుత్వాలు మారడం, ప్రగతికి మార్గాలు అన్వేషించడం ఎంతో సంతోషకరమైన విషయం. దేశంలో పేదరికం పోవాలి. దేశం ప్రగతిపథంలో ముందుకు సాగాలి. పరిశుభ్ర భారత్ కావాలి.. సర్వోన్నత భారత్‌గా సగర్వంగా ఎదగాలి. దేశంలో ప్రతి ఒక్కరూ హాయిగా జీవించే ప్రశాంత వాతావరణం ఏర్పడాలి. ఆ మేరకు అందరినీ ఆదుకునే పథకాలు కావాలి. సామాన్య ప్రజల అభ్యుదయమే ప్రాతిపదికగా ప్రణాళికలు వుంటే తప్ప, వారి అవస్థలు తీరవు. పేద కుటుంబాలవారి జీవనానికి ఇబ్బంది లేకుండా, ప్రతి కుటుంబం ప్రాతిపదికగా, వారి బ్రతుకు తెరువుకు భరోసా కల్పించే పథకాలు అత్యవసరం. అసహాయులను ఆదుకునే పథకాలు, యువతకు, మహిళలకు, బడుగు బలహీనవర్గాల ప్రజలకు అవసరమైన ఎన్నో పథకాలు సరికొత్తగా రూపుదాల్చాలి. ప్రజల జీవితాలకీ, జీవనానికీ భరోసా కావాలి. ప్రజలంతా కోరుకుంటున్నదదే. దేశవ్యాప్తంగా నిత్యం కోట్లల్లుగా జరిగిపోతున్న అవినీతికి, అక్రమాలకు అడ్డుకట్టలు వేయగలిగితే.. నల్లడబ్బును నిరోధించగలిగితే.. ఆకాశానికి పెరిగిపోతున్న ధరలను రెక్కపుచ్చుకుని నేలమీదికి దింపవచ్చు. సామాన్యుల బతుకుబండి సాఫీగా నడిచేందుకు మార్గం చూపవచ్చు. ప్రజలందరికీ ఉపయోగపడేలా రాబడి వచ్చే పథకాల కార్యాచరణ వేగవంతం చేస్తే, ఎంతో మంది పేదలకు ఉపాధి కల్పించవచ్చు. పారదర్శకత పాటించి, ప్రతిభకు పట్టం కడితే, బాగా చదువుకున్న నిరుద్యోగులెందరికో మంచి ఉద్యోగాలు కల్పించవచ్చు. ప్రతి రంగంలోనూ అనవసరంగా పెరిగిపోతున్న వ్యయాన్ని నియంత్రించగలిగితే, లక్షలాది మంది అసహాయులకు చేయూతనందించవచ్చు. అన్ని రంగాల్లోనూ ప్రక్షాళన జరగాలి. మంచికి స్థానం ఇవ్వాలి. ప్రతిభకు పట్టం కట్టాలి. అందుకు ప్రభుత్వం, నాయకులతో పాటు ప్రజలందరి సహకారం అందివ్వాలి. అందరిలోనూ ఆ మేరకు సరికొత్త చైతన్యం రావాలి. ఈ దేశం మనకేమిచ్చిందని కాక, మన దేశ అభ్యున్నతికి మనం ఏమి చేయగలిగామని కూడా ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. దేశాభివృద్ధికి ఇది ఎంతో కీలకమైన దశ. దేశ ప్రగతి బాటలో ప్రతిఒక్కరూ భాగస్వామి అయినప్పుడే మన దేశాన్ని మనం అభివృద్ధిలో పురోగామిగా, అగ్రగామిగా రూపొందించుకోవచ్చు. అప్పుడే నూతన శకం.. కళకళలాడుతూ.. దేదీప్యమానంగా మనందరి కళ్ళముందు సాక్షాత్కారిస్తుంది. ఆ మహాస్వప్నం సాకారం అవుతుంది... అందుకు అందరూ కంకణబద్ధులు కావాలి.. దేశమంతటా నూత్న చైతన్యం వెల్లివిరియాలి!...

### కొత్త చైతన్యం కావాలి



నవ్యాంధ్రప్రదేశ్‌కు తొలి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ఈనెల 8వతేదిన పదవీప్రమాణం చేయడం రాష్ట్ర చరిత్రలో ఒక చరిత్రాత్మక విషయం. కష్టాల కటిక చీకటి వేళ.. చల్లని చందమామ వెన్నెల వెలుగులు విరజిమ్మినట్లు చంద్రబాబు రాకతో సీమాంధ్రలో ఆనందం పల్లవించింది.

## 'అంతర్'జాతీయం

- నక్సలిజం, వేర్పాటువాదం, ఉగ్రవాదం వంటి సమస్యలను ఎదుర్కోవడానికి సమగ్ర సమీకృత ప్రణాళిక అవసరమని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆ దిశగా తన మంత్రిత్వశాఖ ఇప్పటికే పనిని ప్రారంభించిందని చెప్పారు.
- ఈ నెల 14వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గోవా వద్ద అరేబియా సముద్రంలో భారత నౌకాదళంలో పెద్ద యుద్ధనౌక అయిన ఐఎన్ఎస్ విక్రమాదిత్యలో ప్రయాణం చేయనున్నారు. అదేరోజు ఆ నౌకను ప్రధాని జాతికి అంకితం చేస్తారు.
- పదవీచ్యుతుడైన ఈజిప్టు అధ్యక్షుడు మహ్మద్ మోర్సీ మద్దతు దారులైన 10మంది ఇస్లామిస్టులకు సంబంధిత కోర్టు మరణశిక్ష విధించింది. గత జూలైలో ఇక్కడ భారీ హింసాకాండకు, రోడ్ల దిగ్బంధానికి పాల్పడినందుకే ఈ శిక్షను విధిస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.
- సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్‌ను కేంద్ర ప్రభుత్వం సొలిసిటర్ జనరల్‌గా నియమించింది. రాజ్యాంగ నిబంధనల్లో నిపుణుడిగా పేరుగాంచిన రంజిత్‌కుమార్ గతంలో గుజరాత్ ప్రభుత్వం తరపున స్నూప్‌గేట్, సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసుల్లో వాదించి ఉన్నారు.
- రాజ్యసభలో కాంగ్రెస్ పక్ష నేతగా గులాంనబీ ఆజాద్‌ను ఎంపిక చేసారు. రాజ్యసభలో ఆయనకు ప్రతిపక్ష నేత హోదా దక్కనుంది.
- ముడునెలల క్రితం గల్లంతైన మలేషియా విమానం ఎంహెచ్370 ఆచూకీ తెలిపితే 5మిలియన్ డాలర్లు (దాదాపు 33కోట్ల రూపాయలు) అందిస్తామని బాధిత కుటుంబసభ్యులు వెల్లడించారు. ఈ నెల 8వ తేదీన బాధితులు మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో ర్యాలీ నిర్వహించి ఈ విషయం చెప్పారు.
- చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్‌యీ 9వ తేదీ ప్రధాని నరేంద్రమోడీని ఆయన అధికారిక నివాసంలో కలుసుకున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పంపిన సందేశాన్ని ఆయన వినిపించారు. చైనా ప్రధాని ఆహ్వానం మేరకు త్వరలో చైనాలో పర్యటిస్తానని వాంగ్‌యీకి మోడీ చెప్పారు.
- పాకిస్థాన్ ఆర్థికరాజధాని కరాచీలోని జిన్నా అంతర్జాతీయ విమానాశ్రయంపై నిషిద్ధ తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ తీవ్రవాద సంస్థ దాడులకు పాల్పడింది. ఆదివారం అర్థరాత్రి నుండి సోమవారం మధ్యాహ్నం దాకా ఈ దాడులు జరిగాయి. ఈ దాడుల్లో మొత్తం 28మంది మరణించగా అందులో 10మంది ఉగ్రవాదులున్నారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- రాష్ట్రం మధ్యలో రాజధాని. - చంద్రబాబు.
**వ్యాఖ్య :- *ఈసారి విడిపోయినా ఉమ్మడిరాజధానిగా చేసుకోవచ్చుననా?***

వార్త :- ఏ రాష్ట్రంపైనా వివక్ష ఉండదు. - కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్.
**వ్యాఖ్య :- *అలా వివక్ష చూపిస్తే మీకు సోనియాకు తేడా ఏముంది.***

వార్త :- మీ పాలన విజయవంతంగా సాగాలి. - చంద్రబాబుకు సురవరం లేఖ.
**వ్యాఖ్య :- *ఆయన పాలన విజయవంతంగా సాగితే మీకు పనేం ఉంటుంది.***

వార్త :- వెంకన్న సేవలో దిగ్విజయ్‌సింగ్.
**వ్యాఖ్య :- *కాంగ్రెస్ ఓడినందుకు మొక్కుబడి తీర్చుకోవడానికేమో!***

వార్త :- 'ఆప్'లో అంతా బాగుంది. - కేజ్రీవాల్.
**వ్యాఖ్య :- *ఒక్క పార్టీ అధ్యక్షుడి తీరు తప్ప.***

వార్త :- తాత్సారం చేయొద్దు. - రుణమాఫీపై చంద్రబాబుకు జగన్ లేఖ.
**వ్యాఖ్య :- *ప్రతిపక్షంలో వున్నప్పుడు రాళ్లేయడం సులభమే!***

వార్త :- కాంగ్రెస్‌కు ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. - కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు.
**వ్యాఖ్య :- *మీరన్నా దయతలచి ఇవ్వండి.***

వార్త :- తిరుపతిలో ఇస్లామిక్ వర్శిటీని రద్దు చేయాలి. - స్వరూపానందేంద్ర సరస్వతి
**వ్యాఖ్య :- *కట్టేటప్పుడు కళ్లు మూసుకుని ఇప్పుడు గోల చేస్తే ఏం లాభం.***

వార్త :- రెండు నెలల్లోగా ఆస్తుల వివరాలు చెప్పాల్సిందే! - కేంద్రమంత్రులకు ఆదేశాలు.
**వ్యాఖ్య :- *బినామీ ఆస్తులు కలిపా..?***

వార్త :- పేదరికంను పెంచారు. - యూపిఏపై అరుణ్‌జైట్లీ విమర్శ.
**వ్యాఖ్య :- *ఏదో ఒకటి చేసామనిపించుకున్నారుగా!***

వార్త :- మంత్రి పదవి ఇస్తానంటే నేనే వద్దన్నా. - బాలకృష్ణ
**వ్యాఖ్య :- *ఆయనేదో మొహమాటానికి అడిగిఉంటే మీరు సీరియస్‌గా తీసుకున్నట్లున్నారు.***



# వన సంపద... 'వారి' సంపదా...?

- స్మగ్లర్లదే రాజ్యమా?..ఎంతకాలమీ దౌర్జన్యం?
- అపరవీరప్పన్‌ల భరతం పట్టాలి
- కొత్త ప్రభుత్వానికి సవాల్‌గా పరిణమిస్తున్న ఎర్రచందనం స్మగ్లింగ్

**ఎర్రచందనం..** ఇప్పుడు జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా వుంది. అంతేకాదు, కొత్తగా ఏర్పడిన నవ్యాంధ్ర ప్రభుత్వానికి సవాల్‌గా నిలుస్తోంది. ఒకప్పుడు చాటుమాటుగా ఎర్రచందనాన్ని తరలించుకుపోయే స్మగ్లర్లు, ఇప్పుడు ఏకంగా అడవుల్లో అధికారులపై దాడులకు కూడా తెగబడుతుండడం రాష్ట్రంలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. స్మగ్లర్లు ఇప్పుడు ఎర్రచందనం చెట్లనే కాదు, అడ్డొస్తే అధికారులను, సిబ్బందిని కూడా నరకడానికి సిద్దపడుతున్నారంటే ఏమనుకోవాలి?.. అంత దమ్ము-ధైర్యం ఎట్లా వచ్చింది వాళ్ళకి?..'వన సంపద...వారి సంపదా?'..కోట్లాది రూపాయల విలువచేసే ఎర్రచందనం చెట్లను ఎవరిష్ట ప్రకారం వారు నరుక్కుపోవడం ఏమిటి?.. ఎవరబ్బ సొత్తని స్మగ్లర్లు ఇంత దారుణానికి ఒడిగడుతున్నారు?.. ప్రకృతి వరప్రసాదమైన వృక్షాలను నరికేస్తూ, అటు పర్యావరణానికి, ఇటు ప్రభుత్వానికి తీవ్ర నష్టం కలిగించడమే కాక, అడ్డొచ్చిన అధికారులపై కూడా గొడ్డళ్ళతో దాడులకు సిద్ధపడతారా?.. ఏమిటీ ఘోరం?.. అడిగేవారూ, అడ్డుకునేవారూ లేకుంటే పరిస్థితి ఇంకా ఎంత దూరమైనా పోతుంది. అసలు, స్మగ్లర్లు ఇంతగా బరితెగించడానికి కారణం కొంత మంది అధికారులు, సిబ్బంది అలక్ష్యమేననే ఆరోపణలూ లేకపోలేదు. ఎవరో కొంతమంది స్వార్ధానికి, ధనదాహానికి, లాలూచీ వ్యవహారాలకీ అడవుల్లోని పచ్చని చెట్లన్నీ బలైపోతున్నాయని ఆయా గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఆవేదనతో చెప్తున్నారు. అది నిజం కాదా?.. తొలినుంచీ స్మగ్లర్లపై ఉక్కు పాదం పెట్టివుంటే, ఇప్పుడు పరిస్థితి ఇంత దారుణంగా మారి వుండేది కాదు కదా?.. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లుగా వుంటోంది మన అధికారుల తీరు. రాష్ట్రంలో ఒక్క శేషాచలం కొండల్లోనో, లేదా వెలిగొండ అడవుల్లోనో కాదు..ఏ ప్రాంతంలోనైనా సరే అటవీ సంపదకు సరైన రక్షణ వుందా?.. స్మగ్లర్లో, దుండగులో ఎవరైతేనేం.. అదును దొరికితే చాలు.. బంగారం లాంటి ఎర్రచందనాన్ని గుట్టుచప్పుడు కాకుండా ఎత్తుకుపోతున్నా మనం నివారించుకోలేక పోతున్నామంటే ఏమనుకోవాలి?..అందరూ ఆలోచించాల్సిన విషయం ఇది..ఈ స్మగ్లింగ్ వ్యవహారం ఇప్పటి నుంచే కాదు..ఏళ్ళ తరబడిగా యథేచ్ఛగా జరిగిపోతూనే వుందనే సంగతి అందరికీ తెలిసిందే. నిత్యం ఎక్కడో ఒకచోట ఎర్రచందనం అక్రమరవాణా చేస్తున్న వాహనాలో, లేక దుంగలో పట్టుబడుతూనే వున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తూనే వున్నాయి. కానీ, విచిత్రంగా దుంగలు దొరుకుతున్నాయే తప్ప, వాటి తాలూకు దొంగలు మాత్రం దొరకరెందుకనీ?..ఇదే ప్రజలకు అర్ధం కాని విషయం. నెల్లూరు-చిత్తూరు జిల్లాల సరిహద్దుల్లో వున్న వెలిగొండ అడవుల్లో కూడా ఎర్రచందనం వృక్షాలు విస్తారంగా వున్నాయి. దీంతో, ఎంతో కాలం నుంచి ఎర్రచందనం స్మగ్లర్ల కన్ను వీటిపై పడింది. ఎంతో విలువైన ఈ ఎర్రచందనం చెట్లను నరికి, వాటిని చిన్న చిన్న ముక్కలుగా, దుంగలుగా చేసుకుని, తమిళనాడు తదితర ప్రాంతాలకు అక్రమంగా తరలించుకుని పోవడం స్మగ్లర్లకు బాగా అలవాటైపోయింది. బొగ్గుల బస్తాల మాటునో, నిమ్మకాయల బస్తాల చాటునో, రకరకాల మార్గాల్లో అత్యంత వేగంగా వాహనాల్లో వీటిని తరలించేస్తుంటారు. అధికారుల కన్ను గప్పి, తమిళనాడు తదితర ప్రాంతాలకు ఎర్రచందనం తరలించడంలో సిద్ధహస్తులైన స్మగ్లర్లు ఎంతో కాలం నుంచి ఈ స్మగ్లింగ్‌కు (మిగతా 10వ పేజీలో)

## కోట్లాది రూపాయల ఎర్రచందనం
## చెదలు పట్టిపోతోంది...

కోట్లాదిరూపాయల విలువజేసే ఎర్రచందనం దుంగలు అటవీ శాఖల కార్యాలయాల ప్రాంగణాల్లో, గోడౌన్లలో చెదలు పట్టిపోతున్నాయి. అక్రమంగా రవాణా అవుతున్న ఎర్రచందనం దుంగలను గుర్తించి, ఆ ఎర్రచందనాన్ని, దానితోపాటు సంబంధిత వాహనాలను అధికారులు, లేదా పోలీసులు అనేక సందర్భాల్లో పట్టుకుంటూనే వున్నారు. ఎంతోకాలం నుంచి అలా పట్టుకున్న ఎర్రచందనం దుంగలను ఆయా ప్రాంతాల్లోని అటవీశాఖ కార్యాలయాల ప్రాంగణాల్లోనో, గోడౌన్లలోనో పెట్టి వున్నారు. అయితే, ఎంతోకాలం నుంచి వీటికి వేలం జరగకపోవడంతో, ఎంతో విలువైన ఎర్రచందనం చెదలు పట్టిపోతూ వుంది. ఒక్క వెంకటగిరి రేంజ్ పరిధిలోనే కోట్లాది రూపాయల ఎర్రచందనం దుంగలు చెదలుపడుతున్నాయి. అదే విధంగా, వాహనాలు కూడా తుప్పుపట్టిపోతున్నాయి. ఎర్రచందనం దుంగలను వేలం వేస్తే ప్రభుత్వానికి కోట్లాదిరూపాయల రాబడి వస్తుంది. అయితే వేలంకు కేంద్రప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సివుందని అధికారులు చెప్తున్నారు. ఎర్రచందనాన్ని వేలం వేయడం కోసం వాటిని సిద్ధం (మిగతా 10వ పేజీలో)

## గుర్తింపు లేని పాఠశాలలకు కళ్లెం!



జిల్లా వ్యాప్తంగా వున్న గుర్తింపు లేని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షులు కాకర్ల తిరుమల నాయుడు డిమాండ్ చేసారు. బుధవారం నెల్లూరులోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో మౌలికవసతులపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ కళాశాలలు కనీస విద్యార్హత లేనివారితో పాఠాలు చెప్పిస్తున్నాయని ఆరోపించారు. దీనివల్ల లక్షలు ఖర్చు చేసినా విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.

ఈ నెల 18లోగా గుర్తింపులేని పాఠశాలల జాబితాను అధికారులు విడుదల చేయాలని లేకుంటే వీటికి వ్యతిరేకంగా ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని ఆయన హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా వున్న ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులు, అర్హులైన ఉపాధ్యాయులున్నారని, మంచి తరగతి గదులు, ప్లేగ్రౌండ్స్, ఇతర వసతులు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమృల్లా, నాయకులు సాయికిషోర్, మురళీ, ప్రేమ్‌కుమార్, హరీష్‌రెడ్డి, రవితేజ, పృధ్వీ, అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

## విఎస్‌యులో అవినీతి నియామకాలు

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జరిగిన పోస్టుల భర్తీలో ముడుపులు ప్రధానపాత్ర పోషించాయని విద్యార్థి జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్ ఆదిత్యసాయి ఆరోపించారు. విశ్వవిద్యాలయంలో ఉద్యోగాల నియామకాల్లో అవినీతిని నిరసిస్తూ బుధవారం నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట విఎస్‌యు అవినీతి భూతంను దగ్ధం చేసారు. ఈ సందర్భంగా ఆదిత్యసాయి మాట్లాడుతూ పోస్టుల భర్తీలో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేసారు. 2014లో నోటిఫికేషన్ విడుదల చేసి 40పోస్టులకు పరీక్షలు నిర్వహించి ఇప్పటివరకు వాటి ఫలితాలు విడుదల చేయలేదని, అనర్హులతో మాత్రం పోస్టులను భర్తీ చేస్తారని ఆరోపించారు. 2009 నుండి 2014వరకు పోస్టుల భర్తీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చిన నిధుల కేటాయింపుపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేసారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు సంతోష్, సునీల్, చందు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## పశువులు బారి నుండి కాపాడండి



నెల్లూరు జిల్లా కలెక్టర్‌ను ఈనెల 8న కలిసి పశువుల సంచారాన్ని అరికట్టాలని కోరుతూ ఎంఐఎం జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రవూఫ్ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మహమ్మద్ రవూఫ్ మాట్లాడుతూ నెల్లూరు పట్టణం నుండి నగరంగా మారిందేగాని దీని దాఖలాలు ఏ కోశానా కనబడటం లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా నెల్లూరు నగర ప్రధాన రహదారుల్లో, ప్రధాన కూడళ్ళలో పశుసంచారం ఎక్కువై ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఎప్పుడు ఏంచేస్తాయో వాటికే తెలియదని ఒక్కసారిగా దారిన నడిచి వెళ్తున్న వారిపైకి వాహన చోదకులపైకి పరిగెత్తుకుంటూ వచ్చేస్తాయని అన్నారు.

పశువులను పెంచుకొనే వారు వాటికి సరియైన అశ్రయం కల్పించాలని, అలాకాక రహదారుల్లో వదిలేస్తే జరిగే ప్రమాదాలకు ఎవరు బాధ్యత వహిస్తారని, ఇప్పటికైనా సంబంధిత అధి కారులకు జిల్లా కలెక్టరు శ్రీకాంత్ దిశా నిర్దేశం చేసి వీటి సంచారాన్ని అరికట్టాలని ఎంఐఎం తరపున డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం ప్రధాన కార్యదర్శి హమీద్ హుస్సేన్, షేక్ ఖాలీద్, అన్వర్, రఫీ, షఫీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్తదాతలకు అవార్డులు

జిల్లాలో రక్తనిల్వలు పెంచేందుకు కృషి చేసిన మోటివేటర్స్, రక్తదాతలకు ఈ నెల 14న అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ తెలిపారు. బుధవారం నెల్లూరులోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా 14వ తేదీ రెడ్‌క్రాస్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డులను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పెంచల సుబ్బయ్య కూడా పాల్గొన్నారు.

### చేజర్ల తహశీల్దార్...
## ఆఫీసులో దొంగతనం

చేజర్ల తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. కార్యాలయంలో బీరువా తాలాలను పగలగొట్టి ఫైళ్లను చిందరవందర చేసారు. వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించిన కెమెరాలను, పరికరాలను తీసుకెళ్లారు. సుమారు 3లక్షల 20వేల విలువచేసే సామాన్లు చోరీకి గురయ్యాయని ఇన్‌ఛార్జి తహశీల్దార్ పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ADMISSIONS - 2014
B.E/ B.Tech
(All Branches)
Chennai Top Colleges
Konda Reddy
098416 05100 (TN)

## వింజమూరు గ్రామపంచాయతి కార్యాలయము

ఆర్.ఓ.సి.నెం.6/2014 **టెండరు ప్రకటన** తేది.06.06.2014

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వింజమూరు గ్రామపంచాయతిలో కాంట్రాక్టు పద్ధతిపై తే.01.07.2014ది నుంచి తే.30.06.2014ది వరకు 1 (ఒక) సంవత్సరకాలమునకు ఈ క్రిందకనుపరచిన వివరముల ప్రకారము వివిధ రకముల సేవలు అందించుటకు వింజమూరు గ్రామపంచాయతి కార్యాలయంలో తే.19.06.2014దిన ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు టెండర్లు తెరువబడును. అదే రోజు మధ్యాహ్నం 3గంటల నుండి హాజరైన టెండరు దారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. టెండరు దాఖలు చేయువారు ధరావత్తు చెల్లించి టెండర్లు దాఖలు చేయవలయును. ఇతర వివరములు పంచాయతి కార్యాలయము పనిచేయు వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

| వ.నెం. | వివరములు | సిబ్బంది సంఖ్య | ధరావత్తు రూ. |
|---|---|---|---|
| 1. | పారిశుధ్య పనులు నిర్వహణకు | 16 (పదహారు) | రూ.200/- విడివిడిగా ఒక్కొక్కరికి |
| 2. | మురుగు కాలువలు నిర్వహణకు | 3(ముగ్గురు) | రూ.200/- విడివిడిగా ఒక్కొక్కరికి |
| 3. | మంచినీటి సరఫరా నిర్వహణకు | 4(నలుగురు) | రూ.200/- విడివిడిగా ఒక్కొక్కరికి |
| 4. | వీధి విద్యుత్ దీపములు నిర్వహణకు | 2(ఇద్దరు) | రూ.200/- విడివిడిగా ఒక్కొక్కరికి |
| 5. | ట్రాక్టరు డ్రైవరు | 1(ఒక్కరు) | రూ.200/- విడివిడిగా ఒక్కొక్కరికి |
| | **మొత్తం** | **26** | |

గమనిక: A. అనివార్య కారణముల వలన ప్రభుత్వమువారు టెండరు నిర్వహించు తేదీని సెలవుదినముగా ప్రకటించిన మరుసటిరోజు టెండర్లు నిర్వహించబడును.
B. టెండర్లు పాక్షికముగాగానీ, పూర్తిగాగానీ రద్దుపరచుటకు పంచాయతి కార్యదర్శి వారికి అధికారము కలదు.

**సం/- సి.హెచ్.వరప్రసాద్ రావు,**
**పంచాయతి కార్యదర్శి, వింజమూరు గ్రామపంచాయతి.**



ఈ నెల 11వ తేదీన నెల్లూరులోని డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో జరిగిన 'విద్యా చైతన్య సదస్సు' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, పక్కన ఇతర అధికారులు

## నెల్లూరు కబుర్లు



### ముగిసిన ఆట పాట...

# మొదలైన బడి బాట

దాదాపు ఒకటిన్నర నెలరోజుల వేసవి సెలవులు ముగిసాయి. విద్యార్థులు వేసవిసెలవులను బాగానే ఎంజాయ్ చేసారు. ఆటలు, పాటలతో గడిపారు. వినోద విహార యాత్రలకు వెళ్లొచ్చారు. ఇతర ఊర్లలో వున్న చుట్టాలను చూసొచ్చారు. ఒకటిన్నర నెల సెలవులు గిర్రున తిరిగిపోయాయి. కాస్తున్న ఎండలను చూస్తుంటే ఇంకో నెల సెలవులిచ్చినా బాగుండుననేతత్వంలో పిల్లలున్నారు. ఈ నెల 12న జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ఈ నెల 9వ తేదీనే తెరవాల్సి ఉన్నప్పటికీ భీభత్సంగా కాస్తున్న ఎండలకు భయపడి తెరవలేదు. కాకపోతే అన్ని స్కూళ్లలో అడ్మిషన్లు మాత్రం ప్రారంభమయ్యాయి. ఎన్నికల్లో ఆయా పార్టీల టిక్కెట్లయినా సులభంగా వస్తాయేమోగాని, కొన్ని స్కూళ్లలో సీట్లు మాత్రం అంత ఈజీగా రావుగా. ఏద్దైతేనేం... వేసవి సెలవులు ముగిసాయి. పిల్లలకు పుస్తకాలతో కుస్తీలు, పెద్దలకు ఫీజులతో బాక్సింగ్ మొదలైనట్లే!

## టిఎన్‌ఎస్‌ఎఫ్ కొవ్వొత్తుల ప్రదర్శన



హిమాచల్‌ప్రదేశ్‌లోని బియాస్‌నదిలో గల్లంతైన తెలుగు విద్యార్థుల ఆత్మశాంతి కోసం టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరులోని విఆర్‌సి సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. విద్యార్థుల మృతి పట్ల కొంతసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.తిరుమలనాయుడు మాట్లాడుతూ ఈ సంఘటన ప్రతిఒక్కరినీ కలచివేసిందన్నారు. ఈ దుర్ఘటనలో మృతిచెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.కె.అమృల్లా, నగర ప్రధానకార్యదర్శి సాయికిషోర్, హరీష్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, మురళీ, వంశీకృష్ణ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## రాజధానికి లక్ష ఇచ్చిన కోటంరెడ్డి

రాష్ట్ర నూతన రాజధాని నిర్మాణానికి తనవంతుగా లక్ష రూపాయలు విరాళం ఇస్తున్నట్లు తెలుగుదేశంపార్టీ నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అలాగే పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధికి కూడా మరో లక్ష విరాళం ఇస్తున్నట్లు సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు.

## ఊరించి వదిలిన వాన

ఎండలతో కళ్లు కూడా బైర్లు కమ్మసాగాయి. ఏరోజుకారోజు... అబ్బ ఇంత ఎండ ఎప్పుడూ లేదనుకోవడం జనానికి పరిపాటైంది. ఈ ఎండలు ఎప్పుడు తగ్గుతాయిరా బాబూ అని జనం అనుకుంటుంటే తలవని తలంపుగా సోమవారం చిరుజల్లులు నెల్లూరు నగరవాసులను పలకరించాయి. హమ్మయ్య, ఇక ఎండలు పోయినట్టేలే, వాతావరణం చల్లబడిందనుకుంటే మళ్లీ మంగళవారం నుండి ఎండలు అదరకాయడం మొదలుపెట్టాయి. ఒక్కరోజు రిలీఫ్ కోసం వర్షం పడ్డట్లయ్యింది.

## హిమాచల్ మృతుల్లో జేసీ బంధువు

హిమాచల్ ప్రదేశ్‌లోని బియాస్ నదిలో జరిగిన దుర్ఘటనలో నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ జి.రేఖారాణి మేనకోడలు ఆకుల రజిత మృతి చెందారు. రజిత మరణవార్త తెలుసుకున్న రేఖారాణి తీవ్ర విషాదానికి లోనయ్యారు. ఆకుల రజిత అంత్యక్రియల్లో పాల్గొనడానికి ఆమె సోమవారం రాత్రి హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు.

అలాగే తెలుగుగంగ ఎస్ఇ డి.వి.సుబ్బారావు కుమారుడు సాయిరాజ్ కూడా బియాస్ నదిలో కొట్టుకుపోయాడు. ఎస్ఇకి ఈ విషయం తెలియగానే కుప్పకూలిపోయారు. ఆయన నోట మాట రాలేదు. తెలుగుగంగ సిబ్బంది ఆయనను ఓదార్చారు. ఎస్ఇ హుటాహుటిన హిమాచల్‌ప్రదేశ్ వెళ్లిపోయారు.

## ఐసెట్‌లో నెల్లూరోళ్ల ప్రతిభ



షేక్‌రూహి



వాసు

ఎంబిఏ, ఎంసిఏ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఐసెట్ పరీక్షా ఫలితాల్లో నెల్లూరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. నెల్లూరులోని మిలిటరీ కాలనీకి చెందిన షేక్‌రూహి రాష్ట్రస్థాయిలో 6వర్యాంకును, పెద్ద చెరుకూరుకు చెందిన మన్నేపల్లి వాసు 35వ ర్యాంకును సాధించారు.

## ఎంసెట్‌లో నెల్లూరు ర్యాంకర్లు



పి.దివ్య



ఎం.రిషిత

ఎంసెట్-2014లో నెల్లూరు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో తమ సత్తా చాటారు. మెడిసిన్‌లో సూళ్ళూరుపేటకు చెందిన పి.దివ్య రాష్ట్రస్థాయిలో రెండోర్యాంకును సాధించగా, నెల్లూరుకు చెందిన ఎం.రిషిత 18వ ర్యాంకును సాధించింది. దివ్య విజయవాడలోని శ్రీచైతన్య నారాయణ విద్యాసంస్థలో కోచింగ్ తీసుకోగా, రిషిత నెల్లూరులోని విశ్వసాయి కళాశాలలో కోచింగ్ తీసుకుంది.

## ఎంసెట్‌లో విశ్వసాయి ప్రతిభ




అభినందనలందుకుంటున్న రిషిత

ఎంసెట్‌లో తమ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాల డైరక్టర్లు సత్యనారాయణ, కృష్ణమోహన్‌లు వెల్లడించారు. మెడిసిన్‌లో తమ విద్యార్థిని రిషిత రాష్ట్రస్థాయిలో 18వ ర్యాంకు సాధించిందన్నారు. అలాగే అఖిలగోపకుమార్ 261వ ర్యాంకు, ఇ.పవన్ కల్యాణ్‌రెడ్డి 397ర్యాంకు, పి.అరుణ 534ర్యాంకు, ఎన్.మురళీకృష్ణ 946వ ర్యాంకులు సాధించారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో టివిఆర్ అఖిల్ 1051వ ర్యాంకు, కె.సాయిహేమంత్ 3243ర్యాంకు, కె.వి.సురేంద్రరెడ్డి 3479 ర్యాంకు, వి.భాస్విత 3852ర్యాంకు, జి.శ్రీకర్ 4382ర్యాంకులు సాధించారని వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ర్యాంకులను సాధించిన విద్యార్థులను అభినందించారు.

### ప్రతిభకు ప్రతిరూపం రిషిత

నెల్లూరు మాగుంట లే అవుట్‌లో విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థిని ఎం.రిషిత ఆలిండియా ఫ్రీ మెడికల్ టెస్ట్ (ఏఐపీఎంటీ)లో జాతీయస్థాయిలో 399వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆమెకు 285ర్యాంకు వచ్చిందని, దేశవ్యాప్తంగా 5.79లక్షల మంది విద్యార్థులు ఏఐపీఎంటీ పరీక్ష రాసారని, వారిలో 46,271 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించే పరీక్షలో నెల్లూరు అమ్మాయి 399వ ర్యాంకు సాధించడం అలాగే ఎంసెట్ ఫలితాల్లో వైద్య విభాగంలో 160మార్కులకు 156 మార్కులతో రాష్ట్రస్థాయిలో 18వర్యాంకు, ఇంటర్మీడియట్ ఫలితాల్లో బైపిసిలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించడం ఆమె ప్రతిభకు నిదర్శనమని అభినందించారు.

## కార్పొరేషన్ కార్మికులకు 'దేశం' మద్దతు

నెల్లూరు నగరపాలకసంస్థలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు తాము అండగా నిలుస్తామని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీమతి టి.అనూరాధ పేర్కొన్నారు. సొసైటీ రద్దు జిఓకు నిరసనగా పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న ధర్నాలో మంగళవారం ఆమె పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని తొలగించే ప్రసక్తే ఉండదన్నారు. సొసైటీలను రద్దుచేసే జిఓను తెలుగుదేశం ప్రభుత్వం ఉపసంహరిస్తుందని ఆమె భరోసా ఇచ్చారు. సిబ్బందిని విడతల వారీగా క్రమబద్ధీకరించేందుకు కూడా తీర్మానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్పొరేటర్లు నూనె మల్లిఖార్జున యాదవ్, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, దొడ్డపనేని రాజా, శైలజ, రాజేష్, సత్యనాగేశ్వరరావు, తెలుగుదేశం నాయకులు వై.వి.సుబ్బారావు, మండవ రామయ్య, హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలయ్య బర్త్‌డే



సినీహీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 53వ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఈ నెల 10వ తేదీన నెల్లూరులో ఘనంగా నిర్వహించారు. నర్తకి సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బర్త్‌డే కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా భారీఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉచ్చి భువనేశ్వరప్రసాద్, మన్నెం పెంచలయ్య, పిట్టి సత్యనాగేశ్వరరావు, దాసరి రాజేష్‌కుమార్, ఎన్‌బికె ఫ్యాన్స్ గౌరవాధ్యక్షులు వై.రవి, మొయినుద్దీన్, బాలాజీ, మున్వర్ బ్రహ్మనాయుడు, పి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సీమాంధ్రను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దేది చంద్రబాబు ఒక్కడే




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న తెదేపా జిల్లా అధికార ప్రతినిధి డా॥ జడ్.శివప్రసాద్

నూతన ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో ఈనెల 8న తెలుగుదేశం పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు శింగంశెట్టి మురళీమోహన్‌రావు వృద్ధులకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేసి కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు జరిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెదేపా జిల్లా అధికార ప్రతినిధి డా॥జడ్.శివప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ సీమాంధ్రను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చే సత్తా ఒక్క చంద్రబాబుకే సాధ్యం అని, వృద్ధుల సంక్షేమం కోరుతూ పింఛన్ పెంచిన చంద్రబాబుకు వృద్ధుల ఆశీస్సులు నిండుగా వుండాలని పేర్కొన్నారు.

సభలో కార్పొరేటర్లు ఉచ్చి భువనేశ్వరప్రసాద్, అంచూరు జానకి, నేతలు పాముల రమణయ్య, ఏ.శ్రీనివాసులునాయుడు, ముల్లు రామయ్య, బి.వి.నరసింహం, లలితారాం తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాకారుల బృందం నిర్వహించిన పాటకచ్చేరీ, మిమిక్రీ, గజల్స్ ఆలాపన మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జి.దొరబాబు, ఆర్.నాగరాజారావు, పి.వేణు, అమానుల్లాఖాన్, బి.శ్రీనివాసులు, కేతా సుబ్బారావు, గీతామయి వృద్ధుల ఆశ్రమం వ్యవస్థాపకులు తమ్మినేని పాండు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సంవత్సరం 10డెయిరీ పార్లర్‌లు



విజయ డెయిరీ పాలను, పాల పదార్థాలను 24 గంటలూ వినియోగదారులకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నామని విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి చెప్పారు. నెల్లూరు వెంకటేశ్వరపురంలోని డెయిరీ కార్యాలయంలో సోమవారం పాల ఉత్పత్తిదారుల సమాఖ్య పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాలక వర్గం పలు తీర్మానాలను చేసింది. ఈ సమావేశాన్నుద్దేశించి ఛైర్మెన్ రంగారెడ్డి మాట్లాడుతూ విజయ డెయిరీ పాలు, పాలఉత్పత్తులను పెంచేందుకు ప్రతి సంవత్సరం పది డెయిరీ పార్లర్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. పార్లర్ పెట్టడానికి ముందుకొచ్చే వారికి పెయింటింగ్, రంగుల ఖర్చుల నిమిత్తం 20వేల రూపాయలు సబ్సిడీగా ఇస్తున్నట్లు చెప్పారు. డెయిరీలో పనిచేస్తున్న 100మంది డెయిరీ అసిస్టెంట్లకు సంస్థ నియమనిబంధనలకు లోబడి ఒక్కొక్కరికి నెలకు 1500రూపాయలు పెంచే విధంగా తీర్మానించడం జరిగిందన్నారు. సంస్థ కొచ్చే ఆదాయాన్ని బట్టి ప్రతి ఆరు నెలలకోసారి జీతం పెంచాలని పాలకవర్గం తీర్మానించిందన్నారు. ఈ సమావేశంలో డెయిరీ ఎం.డి కృష్ణమోహన్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# నారాయణ జీవితం అనుసరణీయం

**- డాక్టర్ సుబ్రహ్మణ్యం**



కృషి, పట్టుదల, అంకితభావం అన్న వాటికి పర్యాయ పదంగా నిలుస్తూ తన శ్రమతోనే ఈరోజు రాష్ట్రమంత్రి స్థాయికి ఎదిగిన నారాయణ విద్యాసంస్థల అధినేత పి.నారాయణ మనందరికీ ఆదర్శప్రాయుడని నారాయణ వైద్యకళాశాల డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం నెల్లూరురూరల్ చింతారెడ్డిపాలెంలోని నారాయణ ఆసుపత్రి ఆడిటోరియంలో నారాయణ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుండి వచ్చిన నారాయణ విద్యార్థి దశ నుండే కష్టపడి చదివి యూనివర్శిటీ నుండి గోల్డ్‌మెడల్ అందుకున్నారని, ఓ చిన్న కోచింగ్ సెంటర్‌తో తన ప్రస్థానాన్ని ప్రారంభించి ఈరోజు దేశవ్యాప్తంగా 300విద్యాసంస్థలను నెలకొల్పారన్నారు. ఈ సంస్థలలో 37వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారని, 3.5లక్షల మంది విద్యార్థులు ప్రతి ఏటా తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకుంటున్నారన్నారు. దేశానికి ప్రతి ఏటా ఎన్నో వేలమంది ఇంజనీర్లను, డాక్టర్లను అందిస్తున్న ఘనత నారాయణదేనన్నారు. ప్రతిభకు పట్టాభిషేకంగా నారాయణ మంత్రి కావడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ సభలో డాక్టర్ వేదప్రసాద్, భాస్కర్‌రెడ్డి, డాక్టర్ వీరనాగిరెడ్డి, సుబ్బారావు, ప్రొఫెసర్ దివాకర్, డాక్టర్ విజయమోహన్‌రెడ్డి, డాక్టర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి



కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా అన్ని రకాల వ్యవసాయ ఋణాలను వెంటనే రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి కోరారు. సోమవారం నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేకుండా డ్వాక్రా, రైతు రుణాలను రద్దు చేయాలన్నారు. వ్యవసాయం కోసం రైతులు బంగారం కుదువ పెట్టి తీసుకున్న 20వేల కోట్ల ఋణాలను కూడా రద్దు చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర మంత్రివర్గంలో బీజేపీకి అవకాశం కల్పించడం పట్ల ఆయన హర్షం ప్రకటించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబునాయుడికి, జిల్లా నుండి మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన పి.నారాయణకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా బెల్టుషాపులను పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఏ ఒక్క ప్రాంతానికి కాకుండా మొత్తం రాష్ట్రానికి ఉపయోగపడేలా రాజధాని ఎంపిక జరగాలన్నారు. జల రవాణాపై దృష్టిపెట్టాలని, తీరంలో 970 కిలోమీటర్ల పొడవున్న బకింగ్‌హామ్ కెనాల్‌ను పునరుద్ధరించాలని ఆయన కోరారు. గుజరాత్ తరహాలో జోతిగ్రామ్ యోజన క్రింద 24గంటల పాటూ విద్యుత్ సరఫరా చేసేందుకు మన రాష్ట్రాన్ని పైలెట్ ప్రాజెక్ట్ క్రింద ఎంపిక చేసిన కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి పియూష్‌గోయల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# సప్లిమెంటరీకి సిద్ధం

పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు అదనపు జాయింట్ కలెక్టర్ సాల్మన్‌రాజ్‌కుమార్ చెప్పారు. మంగళవారం నెల్లూరులోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆయన పరీక్షల నిర్వహణపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ నెల 16వ తేదీ నుండి పరీక్షలు ప్రారంభమవుతాయని, 28కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. 2654మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు 56మంది చీఫ్‌సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 200మంది ఇన్విజిలేటర్స్ ఉంటారని, పరీక్షాకేంద్రాల వద్ద కరెంట్, మంచినీళ్లు వంటి సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఉష, గూడూరు డిప్యూటీ డిఇఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా విఎస్‌యు తొలి స్నాతకోత్సవం

సింహపురి సమాచారం

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం ఈ నెల 9వ తేదీన నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఘనంగా జరిగింది. ఉదయం 11గంటలకు విశ్వవిద్యాలయ గీతాలాపనతో స్నాతకోత్సవం ప్రారంభమైంది. విశ్వవిద్యాలయం కులపతి గవర్నర్ నరసింహన్ ఈ కార్యక్రమానికి రాకపోవడంతో ఉప కులపతి ఆచార్య రాజారామిరెడ్డి విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నాగేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భారత రక్షణ మంత్రిత్వ శాఖ శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ భుజంగరావుకు 'డాక్టర్ ఆఫ్ సైన్స్' పేరుతో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అలాగే వివిధ విభాగాల నుండి 19మంది విద్యార్థులకు ఉపకులపతి రాజారామిరెడ్డి బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టరేట్‌ను అందుకున్న భుజంగరావు మాట్లాడుతూ సొంత జిల్లాలోని యూనివర్శిటీ నుండి డాక్టరేట్‌ను అందుకోవడం తనకెంతో ఆనందం కలిగిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సైన్స్ అండ్ టెక్నాలజీని అభ్యసించే ప్రతి వెయ్యిమంది విద్యార్థుల్లో భారత విద్యార్థులు నలుగురు మాత్రమే ఉంటున్నారని, అదే జపాన్‌ను చూస్తే 110మంది ఉంటున్నారన్నారు. చదువు కేవలం పట్టాల కోసం కాదని, ప్రగతికి ఉపయోగపడాలన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం చాలా వెనుకబడి వుందన్నారు. రానున్నరోజుల్లో శాస్త్రీయ అధ్యయనాలు పెరగాలన్నారు. దేశాభివృద్ధికి ఉపయోగపడే కోర్సులను విశ్వవిద్యాలయాలలో ప్రవేశపెట్టాలన్నారు. సహజ వనరులను వినియోగించుకోవడంలో మనం వెనుకబడి ఉన్నామని, భవిష్యత్‌లో నీటి కోసం యుద్ధాలు జరిగే పరిస్థితి వస్తుందన్నారు. ఉపకులపతి ఆచార్య రాజా రామిరెడ్డి యూనివర్శిటీ స్థాపించినప్పటి నుండి ఇప్పటివరకు జరిగిన కార్యక్రమాలను వివరించారు.



భుజంగరావుకు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న రాజారామిరెడ్డి



స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, డీన్ వెంకట్రావు, విభాగాధిపతులు శివశంకర్, మురుగయ్య, సునందమ్మలు పాల్గొన్నారు.

# ప్రారంభమైన 'పరిష్కారం'



'పరిష్కారం' కార్యక్రమంలో జేసీ రేఖారాణి

ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు 'పరిష్కారం' పేరుతో నెల్లూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నూతన విధానాన్ని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ సోమవారం ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ జి.రేఖారాణి పరిష్కారం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అర్జీదారులిచ్చిన ప్రతి అర్జీని కంప్యూటర్‌లో నమోదు చేసి వాటిని ఆయా శాఖల అధికారులకు ఆన్‌లైన్ ద్వారా పంపారు. సోమవారం ఈ విధంగా 329మంది వినతిపత్రాలు ఇవ్వగా సంబంధిత అధికారులకు వాటిని పంపడం జరిగింది. అధికారులు వాటిని నిర్దేశిత సమయంలోపు పరిష్కరించాల్సివుంది. ఈ ప్రక్రియ కోసం మొత్తం 10కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. 'పరిష్కారం' తొలిరోజు కావడంతో అర్జీల నమోదు, ఆన్‌లైన్‌లో పంపడం కాస్త ఆలస్యమైంది.

# కోతలతో పరిశ్రమలు మూత...

**- జెన్‌కో సిఎండికి బీజేపీ నేతల విన్నపం**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు కందుకూరి వెంకట సత్యనారాయణ ఈనెల 7న జెన్‌కో సిఎండి హెచ్.వై.దొరను కలిసి విద్యుత్తు కోత గురించి చర్చించి దానివల్ల పరిశ్రమలు మూతపడిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. సరఫరాలో నిబంధనలను సరళీకృతం చేయాలని, పరిశ్రమలకు 8గంటల మేర సరఫరా నిలిపివేస్తున్నందువల్ల పరిశ్రమలు బాగా కుంటుపడి పోతున్నాయని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో యూనిట్‌కు రూ॥5/- కన్నా తక్కువ చార్జీ వసూలు చేస్తుండగా మన రాష్ట్రంలో రూ॥7/-లెక్కన ఛార్జీ విధిస్తుండడం పరిశ్రమల అభివృద్ధికి అడ్డంకి అవుతుందని అన్నారు. ఇళ్లకు విద్యుత్‌కోత కూడా భరించరానిదిగా వుందని పేర్కొన్నారు. పరిమితికి మించి విద్యుత్ వినియోగించుకున్న పరిశ్రమలపై అపరాధ రుసుంను విధించాలని దానిలో యాభైశాతం మే నెల బిల్లుల్లో సర్దుబాటు చేయక పోవడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై సిఎండి హెచ్.వై.దొర స్పందించి బిల్లుల్లో సర్దుబాటు విషయంపై క్రింది స్థాయి అధికారులకు ఆదేశాలు పంపామన్నారు. 500మెగా వాట్ల విద్యుత్ కొరత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వుండగా కేంద్ర గ్రిడ్ నుంచి ఆ లోటును భర్తీ చేయడానికి కేంద్రమంత్రి ఎం.వెంకయ్యనాయుడు ద్వారా కృషిచేస్తామని తెలిపారు. అలాగే కృష్ణపట్నం విద్యుత్ కేంద్రం 2వదశ త్వరగా పూర్తయితే దాదాపు 800 మెగావాట్ల విద్యుత్ సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



శ్రీను గల్పిక

# ప్రమాణస్వీకారోత్సవంలో కన్నీటి కథలు

అది రాజమండ్రిలోని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయం. పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నారు. అసల్లేదు మొర్రో అంటే పెసరపప్పు పెళ్లామా అన్నాడంట ఒకడు... మింగను మెతుకు లేదు కాని మీసాలకు సంపెంగనూనె రాసి నట్టుంది చంద్రబాబు వ్యవహారం. ఓ పక్క రాజధాని కట్టుకోవాలి విరాళాలివ్వండని అడుక్కుంటూ మరోపక్క ప్రమాణస్వీకారోత్సవానికి కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాడు... అసలే రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉంటే ఈ ఆర్భాటం అవసరమా? అని జగన్ ప్రశ్నించాడు.

★★★★★

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో చంద్రబాబు, ఆయన మందీమార్బలం వుంది. ఎదురుగా విలేకరులు. సార్, మీరు ఆర్భాటంగా ప్రమాణస్వీకారం చేస్తున్నారని జగన్ విమర్శిస్తున్నారు. దీనిపై మీ కామెంట్ అని అడిగారు. అందుకు చంద్రబాబు... అందర్నీ పిలిచి ఇంత ఆర్భాటంగా ఎందుకు చేస్తున్నానో నేను చెప్పను, రేపు మీరే వచ్చి చూడండి అని చెప్పాడు.

★★★★★

గుంటూరు వద్ద నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా చంద్రబాబు ప్రమాణస్వీకార ప్రాంగణం అందంగా ఏర్పాటైంది. సాయంత్రం 4గంటలకే జనసందడి మొదలైంది. రాష్ట్రం నలుమూలల నుండి వస్తున్న కార్యకర్తలు కేంద్రం నుండి వస్తున్న నేతలతో ఆ ప్రాంతం సందడిగా మారసాగింది. అయితే అప్పుడే అక్కడ ఓ ఆశ్చర్యకర సంఘటన చోటు చేసుకుంది. సభాప్రాగణం వద్దకు వచ్చే ప్రతి వాహనం నుండి వందరూపాయలు పార్కింగ్ ఫీజు వసూలు చేయసాగారు. పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న కార్యకర్తతో ఓ లారీ డ్రైవర్ ఇదేం అన్యాయమంటూ తగాదా పెట్టుకుంటుండగా... అప్పుడే యనమల రామకృష్ణుడు అక్కడకు వచ్చి... ప్రతి వాహనం నుండి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నాం, ఈ సభను చంద్రబాబు ఇంత ఆర్భాటంగా పెట్టిందే రాజధాని నిర్మాణానికయ్యే ఖర్చును కొంతన్నా రాబట్టడం కోసం. మేం కూడా మా వాహనాలకు పార్కింగ్ ఫీజు కట్టాం, అంతెందుకు చంద్రబాబు కారుకు కూడా కట్టారని చెప్పాడు. ఇక సభాప్రాంగణంలోకి ప్రవేశించేందుకు పలు మార్గాలు పెట్టారు. వివిఐపిలకు 10వేలు, విఐపిలకు 3వేలు, పబ్లిక్‌కు వెయ్యిరూపాయల లెక్కన టిక్కెట్లు పెట్టారు. బయటే టిక్కెట్ల కౌంటర్ పెట్టారు. టిక్కెట్లు అమ్మే కౌంటర్‌కు ఇన్‌ఛార్జ్‌గా జె.సి.దివాకర్‌రెడ్డిని నియమించారు. సభ ప్రాంగణంలోకి పోవడానికి టిక్కెట్లు పెడతారని ఎవరూ వూహించలేదు. అక్కడికొచ్చాక టిక్కెట్ కొనుక్కునే లోపలకు పోవాలనే నిబంధన పెట్టడంతో ఇంత దూరం వచ్చాక తప్పుతుందా అనుకుంటూ అందరూ టిక్కెట్లు కొనుక్కునే లోపలకు పోసాగారు. సభా ప్రాంగణానికి ఇరువైపులా ఫుడ్, టీ, స్నాక్స్, కూల్‌డ్రింక్స్ వంటి స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వున్నారు. టీ, కాఫీ, స్నాక్స్ ఫ్రీగా ఇస్తున్నారేమో ననుకుని చాలామంది గుంపులుగా అక్కడకు ఎగబడ్డారు. కాని అక్కడ తినుబండారాల రేట్ల పట్టిక చూసి అందరూ అదిరిపోయారు. టీ - రూ॥50, కాఫీ - రూ॥70, కూల్‌డ్రింక్ - రూ॥ 110, పఫ్ - రూ॥ 120, 54గ్రా॥ స్వీట్ - రూ॥ 90... ఇలా రేట్లున్నాయి. స్టాల్స్ బాధ్యతనంతా బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చూస్తున్నారు. నెల్లూరు నుండి వెళ్లిన ఓ కార్యకర్త... ఇంతింత రేట్లు పెడితే ఎలా కొనాలి సార్ అని ప్రశ్నించాడు. దానికి బొజ్జల... ఇప్పుడు వందరూపాయలుండే బీరు సీసాను హఠాత్తుగా 500రూపాయలు చేసామనుకో... తాగకుండా మానుకుంటారా నాయనా, ఇవి కూడా అంతే! అదీగాక ఇక్కడ మీరు కట్టే డబ్బు రాజధాని నిర్మాణానికి ఉపయోగపడుతుంది. మన కోసం మన చంద్రబాబే ఇలా ఏర్పాటు చేసాడు. అందరూ సహకరించండని కోరాడు.

అప్పటికే సమయం 6.30గంటలయ్యింది. చంద్రబాబు, ఎల్.కె.అద్వానీ, రాజ్‌నాథ్‌సింగ్, వెంకయ్యనాయుడు, ప్రకాశ్ జవదేకర్, స్మృతి ఇరానీ, రమణ్‌సింగ్, ఆనందీబెన్ పటేల్, మనోహర్ పారికర్, పండిట్ రవిశంకర్, పవన్‌కల్యాణ్... ఇంకా పలువురు నాయకులు ఒకే బస్సులో అక్కడకు వచ్చారు. వారిని చూడగానే జె.సి.దివాకర్‌రెడ్డి పరుగున వచ్చి చంద్రబాబుతో, సార్ మొత్తం ఎంత మందో చెబితే అన్ని టిక్కెట్లు తీసుకుంటాను అని అన్నాడు. టిక్కెట్లేంటి అని అద్వానీ అడిగాడు. చంద్రబాబు ఈ సభ పెట్టిన ఉద్దేశ్యం చెప్పి... మీరు మా అతిథులు, మీ టిక్కెట్లు కూడా నేనే కొంటాను అంటూ బిల్డప్ కోసం జేబులో చెయ్యి పెట్టాడు... ఆయన చేతికి నలిగిపోయిన 10 రూపాయల కాగితం మాత్రమే తగలసాగింది.. ఈలోపు రాజన్‌నాథ్‌సింగ్ ఉండి... బాబు గారు, అక్కరలేదు, మా టిక్కెట్లు మేమే కొంటాం. మీ రాజధాని నిర్మాణానికి ఇది మా వ్యక్తిగత సాయమనుకో అంటూ అందరికీ ఆయనే టిక్కెట్లు కొన్నాడు. తన ప్లాన్ పనిచేసినందుకు చంద్రబాబు లోలోపలే సంతోషించాడు. తర్వాత గవర్నర్ నరసింహన్ రావడం, చంద్రబాబుతో పాటు ప్రకటించిన 19మంది మంత్రుల చేత ప్రమాణస్వీకారం చేయించడం జరిగిపోయింది. ప్రమాణస్వీకారం జరిగేటప్పుడు కూడా స్టాల్స్ నుండి కొందరు వాటర్‌బాటిల్స్, కూల్‌డ్రింక్స్ తెచ్చి అతిథులకు సప్లయ్ చేసారు. అవి ఫ్రీగా ఇచ్చారనుకుని అతిథులు గుటగుట తాగేసాక, వాటి బిల్లులు చేతిలో పెట్టడంతో అతిథుల కళ్లు బైర్లు కమ్మాయి. ప్రమాణస్వీకారోత్సవం ముగిసాక సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన మొదలుపెట్టారు. దీనికి ప్రత్యేకంగా టిక్కెట్ పెట్టారు. చచ్చినట్లు అందరూ టిక్కెట్లు కొన్నారు. ఈసారి కూడా రాజ్‌నాథ్‌సింగ్ ఢిల్లీ నుండి వచ్చిన అందరికీ టిక్కెట్లు కొన్నారు. చిత్తూరు ఎంపి శివప్రసాద్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరగసాగాయి. రాష్ట్ర విభజన తర్వాత సీమాంధ్ర నెత్తిన వున్న దరిద్రాన్నంతా కొన్ని ప్రదర్శనల ద్వారా కళ్ళకు కట్టారు. ఈ ప్రదర్శనల్లో ఒకటి ఇలా వుంది...

ప్రభుత్వ ఉద్యోగి పుల్లయ్య ఇంటికి వస్తాడు. అతన్ని చూడగానే భార్య ఎంకమ్మ పరుగెత్తుకుంటూ వచ్చి... ఏమండీ ఈ నెల జీతమొచ్చిందా... మీరు డబ్బులిస్తే షాపుకెళ్లి బియ్యం తేవాలి, పప్పు, ఉప్పు కొనాలి... అవతల పిల్లలు ఆకలితో ఏడుస్తున్నారు. చంటోడికి పాలడబ్బా కొనాలి అని అడిగింది. అప్పుడు పుల్లయ్య... మన తలరాతే... మన తల రాత, ఆ దరిద్రపు సోనియా మన రాష్ట్రాన్ని చీలగొట్టింది... ఆస్తులు తెలంగాణకు, అప్పులు మనకు ఇచ్చింది. ఈ నెల జీతాలు లేవంట... ఆ చంద్రబాబు సీఎం అయితేగాని మనకు జీతాలు రావు, ఆకలి బాధలు తీరవు అంటూ ఏడవసాగాడు. ఎంకమ్మ కూడా నోట్లో పమిటచెంగు కుక్కుకుని అయ్యో దేవుడా... మా సీమాంధ్ర ప్రజలకే ఎందుకిన్ని కష్టాలు పెట్టావని ఏడవసాగింది. ఇక్కడితో ఆ సన్నివేశం ముగిసింది. బండ లాంటి గుండెల్ని సైతం కరిగించే ఆ సన్నివేశం చూసి అద్వానీ, రాజ్‌నాథ్‌సింగ్, రమణ్‌సింగ్, ప్రకాశ్ జవదేకర్‌లు ఏడవసాగారు. వాళ్లు చంద్రబాబును పట్టుకుని... ఇటువంటి సెంటిమెంట్‌సీన్లు చూపించ డానికా మమ్మల్ని ఢిల్లీ నుండి రప్పించింది అని బాధపడసాగారు. చంద్రబాబు వారిని అక్కడ నుండి భోజనానికి లేవదీసాడు. అప్పటికే అందరూ ఆకలితో నకనకలాడుతున్నారు. కబాబ్, తందూరీ వంటి వంటలుంటాయని వూహించుకుని అందరూ భోజన శాల వద్దకు వచ్చారు. అక్కడ మంత్రి పి.నారాయణ వచ్చిన వారందరి చేతిలో ఒక పులిహోర ప్యాకెట్, ఒక పెరుగన్నం ప్యాకెట్ పెడుతున్నాడు. అది చూసి ప్రకాశ్‌జవదేకర్‌కు కోపమొచ్చింది.. చంద్రబాబు గారు... వరదల్లో బాధితులకు ఇచ్చినట్లుగా ఈ ఆహారపొట్లాల పంపిణీ ఏంటండీ... అని అక్కడున్న సుజనాచౌదరి, సీఎం రమేష్, నారాయణ, కంభంపాటి రామ్మోహన్‌రావు లాంటి వారిని చూపుతూ... చూడబోతే అందరూ కోటీశ్వరుల్లాగా వున్నారు, ఇంత కక్కుర్తి ఏంటి... అతిథులకు కనీసం మంచి భోజన మన్నా ఏర్పాటు చేయలేరా అని అడిగాడు. అప్పుడు చంద్రబాబు... మా వాళ్ల సూటూ బూటూ చూసి మీరు భ్రమపడుతున్నారు... అని సూట్లు వేసుకున్న తన మనుషులందర్నీ వరుసగా నిలబడమన్నాడు. అందరూ వరుసగా నిలబడ్డారు. అందరూ ఒక్కసారి మీ కోట్లు విప్పండి అని చంద్రబాబు చెప్పాడు. అందరూ అలాగే చేసారు... లోపలచూస్తే అందరి ఒంటి మీద చిరుగుల చొక్కాలు... కేంద్ర పెద్దలందరూ వాటిని చూసి ఆశ్చర్యపోయారు. చంద్రబాబు అప్పుడు... ఈ సూట్లు చూసి మమ్మల్ని కోటీశ్వరులను కోవద్దు... లోపలున్న చిరుగులు చూడండి... కోటు వెనుక వున్న చిరుగులనే మీరు తట్టుకోలేకపోతున్నారే... ఇక ప్యాంట్లు విప్పితే కట్ డ్రాయర్‌లకు వున్న బొక్కలను చూసి తట్టుకోగల గుండెధైర్యం మీకుందా? అని ప్రశ్నించాడు. అప్పుడు అద్వానీ, రాజ్‌నాథ్... మీ దరిద్రం మాకు అర్థమైంది, మరీ అంత లోతుగా చూపించక్కర్లేదు... కేంద్రం నుండి మీకు అన్ని విధాలా సాయం చేస్తాం... మీ కన్నీటి కథలు మమ్మల్ని కదిలించాయంటూ ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు.


కదంబం

## మమేకం

డా॥ సి.భవానీ దేవి,
హైదరాబాద్. 9866847000.

మట్టి కొండతో చెప్పింది
ఎత్తైన శిఖరంగా ఎదగాలని
కొండ చెట్టుతో అంది
నాకంటే ఎత్తుగా దీవించమని
చెట్టు మేఘం చెవిలో ఊదింది
మట్టిసిగలో నదిని పూయించమని
నది నీటితో అన్నది
పదిమంది కోసం ప్రవహించమని
నీరు నేలను మెత్తబరిచింది
చెట్లకి జవజీవాలివ్వమని
చెట్టు మనిషిని దీవించింది
తనలాగా జీవించమని
మనిషి మనిషితో నడిచాడు
ప్రకృతితో మమేకమౌతూ
అందుకే
ఇక్కడ ప్రతి మనిషిదీ చెట్టు భాషే
ప్రతి చెట్టూ మనిషి ఆశే!
(శ్రీలంక ప్రకృతి సౌందర్యానికి)

## వైభవంగా పెనుశిల నృసింహస్వామి కల్యాణం



బ్రహ్మోత్సవాల తదుపరి వచ్చే 4వ శని వారం కావడంతో ఈనెల 7న ప్రసిద్ధ పుణ్యక్షేత్ర పెంచల కోనలోని పెనుశిల నృసింహస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణం కనులపండువగా జరిగింది. ఉదయం 5గంటలకు ప్రత్యేక అభిషేకాలు, తదుపరి 3ఆలయాల్లో ప్రత్యేక పూలంగిసేవ జరిపారు. గర్భాలయాల్లో శ్రీవారిని వివిధ ఫలాలతో అలంకరించి భక్తులకు కనువిందు కలిగించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు వీక్షిస్తుండగా శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఇరుదేవేరుల సమేత శ్రీ నృసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. రాత్రి సహస్ర దీపాలంకార సేవ, ఊంజల్‌సేవ నిర్విఘ్నంగా, నిరుపమానంగా నిర్వహించారు.

## బాసర శ్రీ జ్ఞాన సరస్వతీదేవి అక్షరాభ్యాసం

అమ్మ ఒడిలో నుండి బడిలోనికి ప్రవేశించే సింహపురి చిట్టి చిన్నారులకు ఈనెల 14వతేదీ శనివారం ఉదయం10.35గంటలకు నెల్లూరు సరస్వతినగర్ లోని మాడరన్ స్కూల్‌లో సరస్వతిపూజ నిర్వహించి అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు ఆ స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి జన్మనక్షత్రమైన 'మూలా' నక్షత్రం సందర్భంగా ఆరోజు సరస్వతిపూజ నిర్వహించి బాసర సరస్వతిదేవి ఆలయం నుండి తీసుకువచ్చిన అమ్మవారి అక్షతలు, కుంకుమ, శ్రీకారం పలకలను చిన్నారులకు ఉచితంగా అందజేస్తామని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

## శివయ్య ఆదాయం

నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవాలయం హుండీలను బుధవారం లెక్కించారు. ఫిబ్రవరి 16నుండి ఈ నెల 11వ తేదీ వరకుగాను మొత్తం 5,62,495 రూపాయల రాబడి వచ్చింది.

## వైభవంగా చాముండేశ్వరి తిరునాళ్ళు

ఇందుకూరుపేట మండలం గంగపట్నంలోని శ్రీ చాముండేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ప్రతిరోజూ జరిగే పూజల్లో, ఉత్సవాలలో వేలాదిమంది భక్తులు పాల్గొంటున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం చప్పర ఉత్సవం జరిగింది. రాత్రి సింహవాహనంపై అమ్మవారిని ఊరేగించారు. గురువారం రాత్రి కల్యాణోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు.

## "నాన్న"

కాళహస్తి వెంకట శేషగిరిరావు,
నెల్లూరు, 98496 19628.

పసితనంలో
బుడి...బుడి
అడుగులతో
తడబడు వేళ
నడక నేర్పి
నడిపించేది నాన్న!
నీడనిచ్చే వృక్షంలా
వెలుగునిచ్చే కొవ్వొత్తిలా
అన్ని విధాలా
ఆదరించి
ఆదుకునేవాడు నాన్న!
సముద్రమంత
గంభీరత్వం
మండిపడే సూర్యుడి తీక్షణం
మేఘ ఘర్జన
తళుక్కున మెరిసే మెరుపు
వెన్నలాంటి
మనసు
కలగలిపితే నాన్న!

ఫాదర్స్ డే సందర్భంగా (15.6.2014)

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక లావాదేవీలందు జాగ్రత్త వహించండి. స్త్రీలకు పనిభారం శ్రమ ఉంటుంది. ఆత్మీయులను బంధువులను కలుసుకున్నందుకు సంతోషపడతారు. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం, ఆర్థికస్థితి బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. సోదరులకు మేలు జరుగుతుంది. అవసరాలలో ఋణం లభిస్తుంది. యజమానులకు వర్కర్లతో ఇబ్బందులుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. రావలసి బాకీలు లభించడం, అనుకోని ఆదాయం రావడం జరుగుతుంది. బుధ, గురు వారాలలో అదనపు ఖర్చు ఎక్కువగా ఉంటుంది. శుభ కార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలుండగలవు. అనుకున్న పనులు సక్రమంగా పూర్తిచేస్తారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

విలువైన వస్తువులు, స్థిరాస్తుల కొనుగోలు వాయిదా పడతాయి. అనుకున్న పనులు నెరవేరడానికి గట్టి కృషి అవసరం. రావలసిన బాకీలు కొంత వరకు లభిస్తాయి. ఆర్థిక ఇబ్బందులు, వ్యాపార వర్గాలకు గల ఇబ్బందులు కొంత తగ్గుతాయి. వృత్తి వ్యాపారాలలో స్వల్పంగా ఆదాయం పెరుగుతుంది. కుటుంబ సౌఖ్యం బాగుండినా, పిల్లల ప్రవర్తన కొంత ఇబ్బందులు కలిగిస్తాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

నిర్ణయాలు నిదానంగా తీసుకొనండి. బంధు ముఖ్యుల అనారోగ్య వార్తలు వింటారు. ఆత్మీయుల సహకార ప్రోత్సాహాలతో అనుకున్నది సాధిస్తారు. సభలు సమావేశాలలో మీ మాటకు విలువ గౌరవము బాగుంటుంది. ఆర్థికస్థితి బాగుంటుంది. అయినా ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో అనుభవం, రాణింపు పొందుతారు. షేర్ల పై ఆదాయం తృప్తికరం.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 13.06.2014 నుండి
తేది. 19.06.2014 వరకు

ఈ వారము మేషంలో కేతువు శుక్రుడు, 18తేదీ నుండి వృషభ శుక్రుడు, వృషభంలో రవి, 15తేది నుండి మిథునంలో రవి, మిథునంలో బుధగురువులు, 18 తేది నుండి కర్కాటకంలో గురువు, కన్యలో కుజుడు, తులలో శని రాహువులు, ధనుర్మక కుంభమీన రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 19 గురువారము నుండి 12రోజుల పాటు యమునా నదిపుష్కరాలు.

**ముహుర్తము:** తేది 18 బుధవారము ఉ॥గం9.45 నుండి గం॥11.53 లోగా సింహలగ్నమున వివాహ ఉపనయన వ్యాపారములు. బుధవారము రాత్రి 3.30నుండి 5.16లోగా వృషభలగ్నమున వివాహ గృహప్రవేశములు.

**జ్యేష్ఠ మాస కృష్ణ పక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 13 | శుక్ర | పూర్ణిమ | ఉ॥గం.9.50వ॥ |
| తేది. 14 | శని | పాడ్యమి | ఉ॥గం.7.57వ॥ |
| తేది. 15 | ఆది | విదియ | ఉ॥గం.5.50వ॥ |
| తేది. 16 | సోమ | తదియ | రా॥గం.3.30వ॥ |
| తేది. 16 | సోమ | చతుర్థి | రా॥గం.1.00వ॥ |
| తేది. 17 | మంగళ | పంచమి | రా॥గం.10.30వ॥ |
| తేది. 18 | బుధ | షష్ఠి | రా॥గం.8.04వ॥ |
| తేది. 19 | గురు | సప్తమి | రా॥గం.6.00వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శుభకార్యముల నిర్ణయం జరగడం, శుభకార్యములలో పాల్గొనడం, దూరప్రయాణాలుంటాయి. అనుకున్న పనులు సమర్థవంతంగా జరుపుకుంటారు. వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం పెరగడం, వృత్తి జీవనములో ఆదాయము పెరుగుదల ఉంటుంది. ఆర్థిక సమస్యలు కుటుంబ సమస్యలు పరిష్కారానికి రాగలవు. బంధుముఖ్యుల అనారోగ్య వార్తలు వింటారు.

## మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

స్థిరాస్తుల లావాదేవీలు, వ్యాపార భాగస్వాములు నిర్ణయంకాగలవు. కోర్టు కేసులందు అనుకూలత తక్కువ. బంధువర్గంలో చిన్న విషయాలపై విభేదాలుండవచ్చును. ప్రభుత్వ అనుమతులు పొందడం, లీజులు కాంట్రాక్టుల పొడిగింపు జరుగుతుంది. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, కార్యసామర్థ్యం బాగుంటుంది. అనుకున్న పనులు సమర్థవంతంగా జరుపుకొంటారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

బంధుమిత్రులు కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. ఇంటికి సంబంధించిన విలువైన వస్తు సామాగ్రిని సమకూర్చుకొంటారు. వ్యాపార వర్గాలకు అదనపు వనరులు సమకూరుతాయి. పోటీతట్టుకొని వ్యాపార రాబడిని పెంచుతారు. వృత్తిపరంగా మంచి ప్రాబల్యం ఉంటుంది. శుభకార్యాలకు హాజరుకావడం, శుభకార్య ప్రయత్నాలలో కాలవిలంబన జరుగుతుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

స్థిరాస్తుల లావాదేవీలలో జాగ్రత్త వహించాలి. దూర ప్రయాణాలుండగలవు. బిడ్డల ఉద్యోగ, వివాహ విషయాలలో శుభవార్త వింటారు. ఆర్థికంగా కుదుటపడతారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి వర్గానికి మేలు జరుగుతుంది. బంధుమిత్రులతో సంబంధాలు బలపడతాయి. షేర్లు లాభాలనందిస్తాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. దైవకార్యాలకు సహాయపడతారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వ్యాపార నిర్వహణలో మీ ప్రణాళికలు, ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఆదాయం పెరుగుతుంది. బంధువుల రాకపోకలు ప్రముఖులతో పరిచయాలుంటాయి. తొందరపడి అగ్రిమెంట్లు చేసుకొనడం, అప్పులివ్వడం, హామీలివ్వడం చేయవద్దు. వాహనాలు విషయంలో కరెంటు పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండండి. గాయాలు తగిలే అవకాశం ఉన్నది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఉద్యోగులకు ప్రతిభకు తగ్గ గుర్తింపు, అధికారులతో సత్సంబంధాలుంటాయి. గృహ వాహన వస్తు రిపేర్ల ఖర్చులు పైనబడగలవు. వృత్తి ఉపాధి పథకాలలో నిలద్రొక్కుకుంటారు. ఆర్థిక వ్యవహారాలను వ్యాపారాలను సమర్థవంతంగా నిర్వహించి ఆదాయం పెంచుతారు. స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. వ్యవహారాలలో తగిన నిర్ణయాలు తీసుకొని విజయం సాధిస్తారు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ముఖ్యపత్రాలు వస్తువులు పదిలపరచుకొనండి, వస్తు వాహన గృహ రిపేర్ల ఖర్చులు, శుభకార్యాల ఖర్చులు పైనబడగలవు. ప్రభుత్వ కార్యాలయాలలో పనులు ఆలస్యంకాగలవు. ఆర్థిక ఇబ్బందులు, ఒత్తిడులుంటాయి. వ్యాపారవర్గాలకు అవకాశాలు తగ్గవచ్చును. వచ్చే ఆదాయం ఖర్చులకు సరిపోతుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలందు, ఆర్థిక లావాదేవీలందు వెనక్కు తగ్గవలసి వస్తుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆస్తి వ్యవహారాలు, బాకీ వ్యవహారాలు సంతృప్తినిస్తాయి. ఇంటి వసతులను సమకూర్చుకొంటారు. ఆత్మీయులను, బంధువులను కలుసుకొంటారు. ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు సర్దుబాటుకాగలవు. వ్యాపారాలలో అవకాశాలు, పెట్టుబడులుంటాయి. ఆదాయం పెరుగుతుంది. మీ పనులు జరుపుకొనేందుకు జరిపే ప్రయత్నాలు ఆలోచనలు ఫలించగలవు.

# బెల్టుషాపులు బంద్

రాష్ట్రంలో మద్యం బెల్టుదుకాణాలను తొలగించే ప్రక్రియ మొదలైంది. బెల్టుషాపులను తొలగిస్తానని చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారు. అనుకున్నట్లే సీఎంగా ఆయన ప్రమాణస్వీకారం చేసినరోజే మద్యం బెల్టుషాపులను తొలగించే ఫైలుపై సంతకం పెట్టారు. ఈమేరకు బెల్టుషాపులను తొలగించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను ఆదేశించింది. ఈమేరకు బెల్టుదుకాణాల తొలగింపుకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నడుం కట్టింది. నెల్లూరు, గూడూరు ఎక్సైజ్ జిల్లాల పరిధిలో బుధవారం నుండే బెల్టుషాపులను తొలగించే ప్రక్రియ మొదలైంది. జిల్లా వ్యాప్తంగా వున్న బెల్టుషాపులను తొలగించాలంటూ అన్ని బార్లు, వైన్‌షాపులకు ఎక్సైజ్ అధికారులు నోటీసులు జారీ చేసారు. బుధవారం నెల్లూరు ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. బెల్టుషాపుల రద్దు అనేది ప్రభుత్వ నిర్ణయం కాబట్టి వాటిని తొలగించాలని వ్యాపారులకు సూచించారు. మద్యం వ్యాపారులు ఇప్పటివరకు ఎక్సైజ్ అధికారుల అండదండలతోనే బెల్టుషాపులు నిర్వహిస్తూ వచ్చారు. ఎక్సైజ్ వాళ్లు వారి మామూళ్లు వారు చూసుకుంటూ మద్యం వ్యాపారులకు ప్రోత్సాహందిచ్చారు.

ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయాన్ని ఖచ్చితంగా అమలు చేయాల్సిన పరిస్థితి. ఇప్పుడు బెల్టుషాపులు తొలగించడం వ్యాపారులకు పెద్ద సమస్యేమీ కాదు. ఎలాగూ వారి లైసెన్స్ గడువు దగ్గరపడింది. కొత్త ప్రభుత్వం వచ్చింది. ఆ ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీ ఏంటో ఇంకా తెలియదు. కాబట్టి బెల్టుదుకాణం తొలగింపు పని సాఫీగానే జరిగిపోవచ్చు.

# రొట్టెలు పంచిన ముస్లిం యూత్



నెల్లూరు జిల్లా ముస్లిం యూత్ సేవా కమిటీ ఆధ్వర్యంలో నగరంలో స్టోన్‌హౌస్ పేటలో వున్న చిన్న పిల్లల హాస్పిటల్‌లో పిల్లలకు షాబాలన్ నెల సందర్భంగా ఈనెల 7న జ్యూస్, బిస్కట్స్, బ్రెడ్ పంపిణీ జరిగింది. ఈ సందర్భంలో జూనియర్ ఎన్టీఆర్ నెల్లూరుజిల్లా ఫ్యాన్స్ అధ్యక్షుడు ఎస్.ఆర్.ఆలి మాట్లాడుతూ ముస్లిం యూత్ చేస్తున్న సేవలు అభినందనీయమని మేము కూడా వాళ్ళకు తోడు ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ ముస్లిం కమిటి అధ్యక్షుడు ఎస్.కె.ఖలీద్, ఉపాధ్యక్షుడు ఎండి.అల్తాఫ్, కె.జి.ఎన్.ఫ్రూట్స్ మున్నా క్యాటరింగ్ ఇసాక్, ఏజాస్, కంతర్ ఆజాద్, షెహబాస్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా

# కరీముల్లా

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా నెల్లూరు జిల్లా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న కరీముల్లాను ఈనెల 8న ఎన్నుకున్నారు. విద్యార్థి నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేసిన అనుభవశాలి, సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా సిపిఐ పార్టీ తరపున పోటీచేసిన వ్యక్తి కరీముల్లా.

## విద్యార్థి జేఏసి కన్వీనర్‌గా వెంకటేష్

సీమాంధ్ర యువజన విద్యార్థి జేఏసి జిల్లా కన్వీనర్‌గా తాళ్ళ వెంకటేష్‌గౌడ్‌ను నియమించినట్లు ఈనెల 1వ తేదీ రాష్ట్ర కన్వీనర్ ముక్కు రాధాకృష్ణగౌడ్ తెలిపారు. రాబోవు కాలంలో జిల్లాలోని అన్ని మండలాలకు, అసెంబ్లీ నియోజక వర్గాలకు పూర్తి స్థాయిలో కమిటీలు వేయడం ప్రాంతాల వారీగా విద్యార్థి, యువత సమస్యల పట్ల తగురీతిలో ఉద్యమించడం జరుగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలకై పోరాటాలు చేస్తామన్నారు. దీనిలో అందర్నీ భాగస్వాములను చేయడమే తమ లక్ష్యమన్నారు.

భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర

## ఉపాధ్యక్షుడిగా కిరణ్

భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణలు ముగిసిన తదుపరి రాష్ట్ర కమిటీ ఎంపిక ఈనెల 8న జరిగింది. కమిటీలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నెల్లూరు జిల్లాకు చెందిన కిరణ్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎస్.రవి, ఎం.వి.రమణలను ఎన్నుకున్నారు.

పదవీ విరమణ వయస్సే కాదు...

# పిఆర్‌సి ఫిట్‌మెంట్ కూడా పెంచాలి

నవ్యాంధ్రప్రదేశ్‌కు తొలి ముఖ్యమంత్రి అయిన నారాచంద్రబాబునాయుడు ఈనెల 8న ప్రమాణస్వీకారం అనంతరం 5సంతకాలు చేసి వివిధస్థాయిల్లో ప్రజానీకాన్ని ఆనంద పరిచారు. రుణమాఫీపై కమిటీవేసి రైతాంగాన్ని, వృద్ధులు, వికలాంగులను ఫించను పెంచడం ద్వారా, ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా రూ॥2కే 20లీటర్ల మినరల్‌వాటర్ గ్రామాల్లో సరఫరా చేయడంతో గ్రామ ప్రజానీకాన్ని బెల్టు షాపులను రద్దు చేస్తూ మహిళలను, 5వ సంతకంతో 58ఏళ్ళ పదవీ విరమణను 60ఏళ్ళకి పెంచడంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను సంతోషపరిచారు. ఐతే అదే సమయంలో నిరుద్యోగులకు అన్యాయం జరుగకుండా ప్రభుత్వ ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు పెంపొందిస్తామన్నారు. ఇదంతా బాగానే వుంది కాని, గతంలో ఉద్యోగులను ఇబ్బందులపాలు చేయడమే తమ ఓటమికి కారణమనుకొని వారికి ఈయన పదవీవిరమణ వయస్సు 60ఏళ్ళు చేసి వారు లబ్ధి పొందేలా చేస్తున్నాడా అన్నది అర్థసత్యమే. స్వామికార్యం, స్వకార్యం అన్నట్టు ఉద్యోగస్తులు ఉద్యోగ విరమణ వయస్సు పెంచడం ద్వారా బహుళ ప్రయోజనం పొందడమే ఆయన వ్యూహంగా కనిపిస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేడు దయనీయంగా వుండడంతో దానిని అధిగమించేందుకు ఒక ప్రక్క ఉద్యోగస్తులలో కొందరికైనా తన పట్ల విశ్వాసం పెరిగేటట్లు చేయడం మరొకప్రక్క కారణాలుగా కనిపిస్తున్నాయి. ఉద్యోగస్థులలో ఆయన పట్ల నమ్మకం పెరగాలంటే వారి మిగిలిన డిమాండ్లలో ముఖ్యమైన వాటిని వీలయినంత త్వరగా పరిష్కరించడం ఎంతో అవసరం. ముఖ్యంగా వారు ఊహించనంత ఎక్కువగా పిఆర్‌సి ఫిట్‌మెంట్‌ను ఇవ్వడం అదీ తెలంగాణలలో ఉద్యోగస్థులకు కెసిఆర్ ఇచ్చిన హామీలకంటే మించేటట్లు వుండేలా చూడడం ద్వారా వారి అభిమానాన్ని పొంది తద్వారా పరిపాలనలో పారదర్శకత పెంపొందేలా చర్యలు తీసుకోవచ్చు. చూద్దాం, నవ్యాంధ్రప్రదేశ్ నవ ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనలో నూతనత్వం చోటు చేసుకుని సీమాంధ్ర సున్నాంధ్ర కాకుండా స్వర్ణాంధ్రగా మారుతుందేమో!

# కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభిమాని మొక్కు చెల్లింపు

కష్టేఫలి అన్నట్టు నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులుగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గెలుపొందడంతో సంతోషంగా ఆయన అభిమాని శివ మాగుంట లే అవుట్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7న 501టెంకాయలను కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ ఇరవై ఏళ్ళు ప్రజా సమస్యలను పరిష్కరించే దిశలో శ్రీధరన్న కృషి చేస్తున్నారని, ఇక ముందు ప్రజాసేవలో మరింతగా పాలుపంచుకొంటూ ఉన్నతస్థాయికి ఎదగాలని ఏడుకొండల వెంకటేశ్వరస్వామిని ప్రార్థించానన్నారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, సురేష్‌బాబు, గుండాల మధుసూదన్‌రెడ్డి, జాష్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ వైభవం...!



నెల్లూరు మూలాపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి - నవనీతల కుమారుడు **హేమచంద్రారెడ్డి - శ్రీ శాంతిస్వరూప** (నెల్లూరు వాస్తవ్యులు ఎ.ప్రసాదరెడ్డి - ఇందిరల కుమార్తెల కల్యాణం జూన్ 1న నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

# ఎర్రచందనం చెదలు పట్టిపోతోంది...

(5వ పేజీ తరువాయి)

చేసివున్నామని కూడా చెప్తున్నారు. అయితే, వేలం వేసేందుకు అనుమతి రావడంలో బాగా జాప్యం జరుగుతున్న నేపథ్యంలో, విలువైన ఎర్రచందనం దుంగలు చెదలుపట్టిపోతున్నాయని తెలుస్తోంది. వాటిని వేలం వేసేదాకానైనా భద్రపరిచేందుకు తగ్గ గోడౌన్లు లేకపోవడం మరింత విచారకరం. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎర్రచందనానికి మంచి డిమాండ్ వున్న నేపథ్యంలో, అధికారులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు నాణ్యత కోల్పోకుండా భద్రపరచాల్సివుంది. ఇకనైనా వాటి భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. లేకుంటే, వానకు తడిసి, ఎండకు ఎండి అవి నాణ్యత తగ్గిపోతే, వేలంవేసినా ఆశించిన రాబడి రాదు. అటు కేంద్రప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో వ్యవహరించి, ఏ ప్రాంతాల్లో ఎంత ఎర్రచందనం పట్టుకున్నారు?..వాటి నిల్వలు ఎంత వున్నాయి?..పూర్తిస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, వాటి వేలంకు అవసరమైన చర్యలు తీసుకుంటే ప్రభుత్వాలకు రాబడి వస్తుందని ఆయా ప్రాంతాల్లో ప్రజలు సూచిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో వున్న అడవుల్లో ఇలా స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం విలువ వందలాది కోట్ల రూపాయల్లోనే వుంటుందని వేరే చెప్పనక్కర లేదు. రాబడివచ్చే ఇలాంటి విషయాలపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాల్సి వుంది. ఎర్రచందనం అక్రమరవాణాకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, అక్రమరవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సివుంది. అదేవిధంగా, రాష్ట్రంలో అనేక రకాల అటవీ ఉత్పత్తులు జరుగుతున్నాయి. వాటిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమాలు యథేచ్ఛగా జరిగిపోతూనే వున్నాయనే ఆవేదన ప్రజల్లో వుంది. ఇకనైనా అటవీ ఉత్పత్తులకు సంబంధించి, వాటి వినియోగానికి సంబంధించి ఒక క్రమబద్ధమైన విధానం అమలుచేయాల్సివుంది. అవినీతికి, అక్రమాలకు తావులేని విధంగా వాటిని క్రమబద్ధీకరించాల్సి వుంది. కోట్లాది రూపాయల విలువైన ఎర్రచందనం అక్రమరవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుచేయాల్సివుంది. అక్రమాల బాట నుంచి వాటిని తప్పించి, అటవీ ఉత్పత్తుల పరిరక్షణకు, వాటి సక్రమ వినియోగానికి బాటలు వేయగలిగితే, అటు ప్రజలకు ఇటు పర్యావరణాన్ని కాపాడేందుకూ మార్గం వేసినట్లే అవుతుంది. మరోవైపు ఈ అక్రమరవాణాను అడ్డుకోవడం, పట్టుకున్న ఎర్రచందనాన్ని నిర్ణీత సమయంలో, సరైన పద్ధతుల ద్వారా విక్రయించడం వంటి చర్యలు చేపడితే, ప్రభుత్వాలకి కూడా రాబడి ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అడవులను మరింతగా అభివృద్ధి చేసుకుని, వనాలను సంరక్షించుకుంటే, అటవీప్రాంతాల్లో విస్తారంగా మొక్కలు నాటితే పర్యావరణ పరిరక్షణకు చేయూతనిచ్చినట్లవుతుంది. భవిష్యత్ తరాలవారికీ పచ్చదనాన్ని పంచి ఇచ్చినట్లవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత నిర్దిష్టమైన విధానాలతో అడవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాల్సివుంది.

# వన సంపద...'వారి' సంపదా...?

(5వ పేజీ తరువాయి)

అలవాటు పడిపోయారు. స్మగ్లర్లను పట్టుకునేందుకు అధికారులు ఎన్ని వ్యూహాలను పన్నినా, ఎత్తుకు పైఎత్తులు వేస్తూ, రకరకాల అడ్డదారుల్లో స్మగ్లరు ఏదోఒక విధంగా ఎర్రచందనం తరలించుకునిపోతూనే వున్నారు. ఏ రాత్రివేళో..అదను చూసుకుని అడవుల్లోకి చాటుమాటుగా వెళ్ళడం, అక్కడున్న చెట్లను నరికి వాహనాల ద్వారా తరలించుకుపోవడం స్మగ్లర్లకు ఒక వ్యాపారంగా, కొంతమందికి అదే వృత్తిగా కూడా తయారైపోయింది. ఎర్రచందనం చెట్లను నరుక్కుపోవడం తమ హక్కు అన్నట్లుగా, అడవుల్లో వీరిది ఇష్టారాజ్యమైపోయింది. ఈ స్మగ్లింగ్ నిరోధానికి ఆయా ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో అటవీసిబ్బంది, అధికారులు, పోలీసులు వున్నప్పటికీ, స్మగ్లర్లు వారి కన్నుగప్పి రకరకాల మార్గాల్లో ఎర్రచందనాన్ని తరలించుకుపోతూనే వుండడం దారుణం. నిజానికి, స్మగ్లర్లను పట్టుకోవాలనే చిత్తశుద్ధి వుంటే ఇంత పెద్ద అధికారయంత్రాంగానికి అదొక లెక్కా?..అడవిలోకి వెళ్లేందుకు ఎన్నెన్ని దారులున్నాయో, అటవీ అధికారులకు, సిబ్బందికి తెలియదా?..ముఖ్యమైన ప్రాంతాల్లో, అడవుల్లోకి వెళ్ళే అన్ని దారుల్లోనూ నిఘా సిబ్బందిని ఏర్పాటు చేసి, సిసి కెమెరాల వంటి నిఘా నేత్రాలను ఏర్పాటు చేస్తే స్మగర్లను అరికట్టలేమా?..అటవీప్రాంతాల్లో మెరికల్లాంటి సిబ్బందిని ఏర్పాటు చేస్తే, అడుగడుగునా తనిఖీలను ముమ్మరం చేస్తే, అధికారులు, సిబ్బంది తప్ప అడవుల్లోకి అనుమతి లేకుండా మరెవరూ వెళ్ళరాదన్న నిషేధాజ్ఞలు విధించి, పకడ్బందీగా అమలుచేస్తే స్మగ్లర్ల ఆట కట్టించడం సాధ్యం కాదా?.. అలాకాక, ఎవరిష్టప్రకారం అడవుల్లోకి వెళ్ళి లక్షలాది, కోట్లాది రూపాయలు విలువజేసే ఎర్రచందనం చెట్లను అడ్డంగా నరుక్కుని పోతుంటే, ఎంతోకాలం నుంచి ఈ స్మగ్లింగ్ జరిగిపోతూనేవున్నా, వారిని పట్టుకోలేనంతటి చేతకానివారమా?...అన్నది ఆయా ప్రాంతాల్లోని ప్రజల ఆవేదన.

కొత్త ప్రభుత్వం ఇకనైనా పూర్తిస్థాయిలో రంగంలోకి దిగితే తప్ప ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నిరోధించడం సాధ్యం కాదు. కోట్లాది రూపాయల ఎర్రబంగారాన్ని ఇలా దుండగులు కొల్లగొట్టుకుపోతూంటే ఎంతకాలమిలా గుడ్లప్పగించి చూస్తూ వుంటాం?...ప్రభుత్వానికి కోట్లాదిరూపాయల రాబడి వచ్చే ఈ అంశంపై అధికారులు ఇకనైనా చిత్తశుద్ధితో దృష్టి పెట్టాలి. అటవీఅధికారులు, పోలీసు అధికారులూ కలసి ఈ స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలి. అపర వీరప్పన్‌ల భరతం పట్టాలి. అమూల్యమైన వన సంపదను పరిరక్షించుకోవాలి.

# తంత్రం... మంత్రం

(మొదటిపేజీ తరువాయి)

ఒప్పించి ప్రభుత్వం నుంచి పనులు చేసుకురావడంలో ఆయన దిట్ట. బిజెపిలో అగ్రనేతగా వున్నప్పుడు, తనకు ప్రభుత్వంలో పదవి వున్నా, లేకున్నా ఆయన ఏనాడూ సింహపురి ప్రజలను విస్మరించింది లేదు. ఎప్పుడు ఈ జిల్లాకు విచ్చేసినా వెంకటాచలం మండలంలో అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. ఎందరెందరో ప్రముఖులను, ఆయా రంగాల్లో విశిష్టసేవలు అందిస్తున్న వారిని రప్పించేవారు. మన సంస్కృతీ సంప్రదాయాలను మరింతగా ఫరిడవిల్లజేసే విధంగా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆయనకు ఈ జిల్లా అన్నా, జిల్లా అభివృద్ధి అన్నా ఎంతో ఇష్టం. ఆయన కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా వున్నప్పుడు కూడా జిల్లాలోని రోడ్ల అభివృద్ధికి తన సహకారం అందించారు. ఇప్పుడు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా ఆయన జిల్లాను, ప్రత్యేకించి నెల్లూరు నగరాన్ని సుందర నందనవనం చేసేందుకు కృషి చేస్తారని అందరూ ఆకాంక్షిస్తున్నారు. నెల్లూరు నగరం అంటేనే ఇప్పుడు చెత్తకుప్పలకు, దోమలకు నిలయంగా మారింది. ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణమే రాజ్యమేలుతోంది. గత పాలకులు ప్రజాసంక్షేమాన్ని పట్టించుకోకపోవడంతో, నగరంలోని ప్రజలు నిత్యం ఎన్నో రకాల సమస్యలతో నిత్యం నానా యాతనలు పడ్డారు. నగర శివారు ప్రాంతాలకు ఇప్పుడు కూడా పరిశుభ్రమైన మంచినీరు కరువే. నెల్లూరు చెంతనే పవిత్రమైన పెన్నా నది వున్నా, అది కూడా మురుగునీటితో కంపుకొడుతోంది. పెన్నానదిపై వంతెన నిర్మాణం ఏళ్ళు గడిచిపోతున్నా కాలయాపన జరుగుతూనే వుంది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నగరపాలక సంస్థ పనితీరు అస్తవ్యస్తంగా మారింది. నగరాన్ని సుందర నందన వనం చేస్తామని గత పాలకులు పదేపదే ప్రకటించినా, అందం సంగతి తర్వాత మరింత అధ్వాన్నంగా మారింది.

చిన్న వానకే నగరం మురుగుగుంటలా మారుతూనే వుంది. ఎప్పటినుంచో ఒక కల. నెల్లూరు నగరానికి భూగర్భ డ్రైనేజీ వస్తుందని..ఈ మురుగు కంపు పోతుందని. అయినా నేటికీ అది కలగానే మిగిలిపోయింది. భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి వేస్తున్న అంచనా వ్యయం మాత్రం ఏడాదికేడాది భారీగానే పెరిగిపోతోందే తప్ప, ఆచరణకు వచ్చే మార్గమే కనిపించడం లేదు. ఇక నగరంలో ట్రాఫిక్ పరిస్థితి అయోమయం. నగరంలో జనాభా పెరిగిపోయి, వాహనాల సంఖ్య భారీగా పెరిగిపోయి, ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. ట్రాఫిక్‌ను సక్రమంగా నియంత్రించలేక అవస్తగానే వుంది. కేంద్రప్రభుత్వం నగరాలను స్మార్ట్ సిటీలుగా రూపొందించాలనే బృహత్‌ప్రణాళికలో నెల్లూరునూ చేర్చి, కేంద్రం నుంచి అవసరమైన నిధులను తెచ్చి, నెల్లూరును సమస్యల వలయం నుంచి బయటపడవేసే సత్తా కేంద్ర మంత్రిగావెంకయ్యనాయుడికి వుందని ప్రజలందరి విశ్వాసం. మరోవైపు పురపాలక మంత్రిగా నారాయణ సహకారంతో అటు నగరపాలక సంస్థతోపాటు, జిల్లాలోని అన్ని మున్సిపాల్టీలోనూ అభివృద్ధికి కొదవ వుండదని అందరూ ఆకాంక్షిస్తున్నారు. అటు వెంకయ్య పరిపాలనా తంత్రంతో, ఇటు నారాయణ ప్రగతి మంత్రంతో జిల్లాతో పాటు, నగరానికీ, పురపాలక ప్రాంతాల సమస్యలకీ ఇక పరిష్కారం లభిస్తుందని అందరూ ఆశిస్తున్నారు. అటు నాయకులు, ఇటు అధికారులు సంయుక్తంగా మంచి ప్రణాళికలతో సిద్ధం కావాలే కానీ, అన్ని వనరులు పుష్కలంగా వున్న ఈ జిల్లా అభివృద్ధికి ఎలాంటి లోటూ వుండదు. మంచి నేతలు, మంచి పదవుల్లోనే వున్నారు కనుక, వారు తలచుకుంటే ఇక ప్రగతి కళ్ళెదుట నిలిచినట్లే. ప్రజల ఆశలు ఆకాంక్షలు సాకారమైనట్లే!..జిల్లా ప్రగతిని, నగరాభ్యున్నతిని కోరుకునేవారికి ఇంతకన్నా శుభతరుణం మరెప్పుడు వుంటుందీ!...

# దూకుడుకు ముకుతాడు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంటున్నాడు. గత యూపిఏ ప్రభుత్వం రాష్ట్ర విభజన పేరుతో ఆస్తులు, ఆదాయాన్నంతా తెలంగాణకు, అప్పులు, అవస్థలన్నీ ఆంధ్రకు వ్రాసిచ్చేసింది. విభజన బిల్లులో ఏదో కంటితుడుపుగా పోలవరం ప్రాజెక్ట్, సీమాంధ్రకు స్వయంప్రతిపత్తి, ప్రత్యేక ప్యాకేజీ వంటివి పొందుపరిచారు. ఈరోజు అన్యాయానికి గురైన ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా కేసీఆర్ అడ్డుతగలాలని చూస్తున్నాడు. మిగులు బడ్జెట్ ఉంచుకుని కూడా తెలంగాణకు ప్రత్యేక ప్రతిపత్తి, ప్రత్యేక ప్యాకేజీ కోరుతున్నాడు. పోలవరం ప్రాజెక్ట్ క్రింద ముంపు మండలాలను సీమాంధ్రలో కలుపుతూ కేంద్రప్రభుత్వం ఆర్డినెన్స్‌ను ఆమోదించడం జరిగింది. దీనిపై టీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంటులో పెద్ద రాద్ధాంతం చేస్తున్నారు. రాష్ట్ర విభజన పేరుతో గత యూపిఏ మొండిగా వ్యవహరించి సీమాంధ్రకు అన్యాయం చేసింది. ఇప్పుడు కేసీఆర్ దూకుడుకు కళ్లెం వేసి సీమాంధ్రకు న్యాయం చేసే విషయంలో ఇప్పటి ఎన్డీఏ మొండిగానే వ్యవహరించాల్సివుంది.

# సమస్యలతో సవారి

(మొదటిపేజీ తరువాయి)

కులాలు, మతాల వారీగా ఓట్లు రాబట్టుకోవడానికి ఎవరెవరిని ప్రయోగించాలో అందర్నీ ప్రయోగించారు. చివరకు వైయస్‌కు బలమైన మద్దతుదారులుగా వున్న అన్నదాతల ఓట్లు రాబట్టేందుకు రుణమాఫీ వల విసిరాడు. రుణమాఫీ అన్నది రైతులకు ఒకరకంగా వై.యస్. చేసిన అలవాటే! 2009లో వై.యస్. రెండోసారి అధికారంలోకి రాగానే రైతు రుణాలను రద్దు చేసాడు. దీంతో ఎన్నికలొచ్చాయంటే ఏదో ఒక పార్టీ రుణమాఫీ వాగ్ధానం చేస్తుందని రైతులు భావిస్తూ వచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్నాయనగా దాదాపు ఏడాది ముందు నుండే వ్యవసాయ రుణాలు ఎక్కువగా తీసుకున్నారు. ఎలాగూ ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అప్పులు రద్దు చేస్తుందని భావించి కట్టగల స్థోమత ఉన్నోళ్లు కూడా కట్టడం మానేశారు. ముఖ్యంగా కృష్ణా నుండి విశాఖ వరకు జిల్లాల్లో ఈ రుణాలు ఎక్కువగా వున్నాయి. రైతులలో వున్న రుణ మాఫీ ఫోబియాను చంద్రబాబు పసిగట్టాడు. ఖచ్చితంగా ఇది రిజల్ట్స్ ఇస్తుందనే నమ్మకంతో రుణమాఫీ వాగ్ధానం చేసాడు. జగన్ మాత్రం కొంత వాస్తవంలోకి పోయాడు. విభజన తర్వాత రాష్ట్రం వున్న ఆర్థిక పరిస్థితుల్లో రుణమాఫీ చేయడం అసాధ్యమనుకున్నాడు. అలాంటి వాగ్ధానం చేసి ఫెయిలైతే చెడ్డపేరు వస్తుందనుకున్నాడు. అందుకనే రుణమాఫీ వాగ్ధానం చేయలేదు. అయితే రుణమాఫీ తనను ఇంతగా దెబ్బతీస్తుందని ఆయన గ్రహించలేదు. అలా వూహించి వుంటే రుణమాఫీ గురించి జగన్ కూడా సానుకూలంగానే స్పందించేవాడు.

రుణమాఫీ వాగ్ధానమైతే చేసాడుగాని ఇప్పుడు దానిని అమలు చేయడం చంద్రబాబుకు పెద్దసమస్యే! అన్నీ రుణాలు కలిపితే 83వేల కోట్ల పైనే ఉన్నాయి. అసలే 15వేల కోట్ల లోటుబడ్జెట్‌తో నవ్యాంధ్ర ప్రదేశ్ ప్రయాణం మొదలైంది. కేంద్ర ప్రభుత్వం ఆదుకోకుంటే వచ్చే నెల ఉద్యోగులకు జీతాలు కూడా ఉండవు. మరి 83వేలకోట్లు రుణమాఫీ ఎలా చెయ్యాలి. ఇంత ఆర్థిక భారాన్ని ఒకేసారి మోసే శక్తి రాష్ట్ర ప్రభుత్వానికెక్కడుంది. రుణమాఫీ చేస్తే ఆ మొత్తాన్ని ప్రభుత్వం బ్యాంకులకు జమ చేయాల్సి ఉంటుంది. అలా చేయలేకపోతే బ్యాంకులు ఎత్తిపోతాయి.

ఇప్పుడు రుణమాఫీ మీద కొత్తగా నిబంధనలు విధించలేరు. ఇంత మందికే వర్తిస్తుందని, ఇంతవరకే మాఫీ అవుతుందని చెప్పలేరు. అలా చేస్తే తెలంగాణలో మాదిరిగా ఇక్కడా ఆందోళనలు తప్పవు. అసలే చంద్రబాబు మీద అంతంత మాత్రపు నమ్మకం. ఇక్కడ ఏ మాత్రం తేడా వచ్చినా చంద్రబాబు పాలనకు ఆదిలోనే హంసపాదు పడుతుంది.

# గూడూరు డివిజన్ వార్తలు

## మున్సిపల్ పరిధిలో నిర్మించే...
## భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమీషనర్ అనూరాధ

గూడూరు మున్సిపల్ పరిధిలో నూతనంగా భవన నిర్మాణాలు చేపట్టే వారు ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సోమవారం మున్సిపల్ కమీషనర్ అనూరాధ తెలిపారు. మున్సిపల్ పరిధిలో భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మాణ పనులు మొదలుపెట్టిన అనంతరం అనుమతులకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపడితే స్థలం విలువ, భవన నిర్మాణ విలువలో 10శాతం నుండి 50శాతం వరకు అపరాధ రుసుము విధించడం లేదా మూడేళ్ల వరకు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. అనధికారిక భవనాలకు నీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్లకు నో అబ్జక్షన్ సర్టిఫికేట్లు, డ్రైనేజీ వసతి కల్పించడం జరగదన్నారు.

ఆస్థి పన్ను 100శాతం నుంచి 200శాతం వరకు అదనంగా విధిస్తామని తెలిపారు. కాగా మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలతో మునిసిపల్ కమీషనర్ సమావేశమయ్యారు. ప్లాస్టిక్ నిషేదం అమలు, ప్లాస్టిక్ సామాగ్రి వినియోగం వల్ల జరిగే అనర్ధాలను సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు దానికి సంబంధించి ఇతర సామాగ్రి వినియోగించడం వల్ల భవిష్యత్ తరాల వారికి ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీలు ఏర్పాటుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ రమణారెడ్డి, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

## గూడూరులో వైభవంగా
## శ్రీవారికి శేషవాహనసేవ



గూడూరు పట్టణం రాజావీధిలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, భేరిపూజ, ధ్వజావరోహణం, నవకుంభారోహణం, ప్రధానాగ్ని ప్రణయనం, నిత్యహోమం, బలిహరణ, ఉత్సవాదాస్నపన, కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి స్వామి వారు శేషవాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో తాళమ్మ

గూడూరు విజయనగర్ కాలనీలోని తాళమ్మ ఆలయంలో అమ్మ వారికి ఆదివారం భక్తులు పొంగళ్లు నైవేద్యం సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

# శ్రీకాళహస్తి న్యూస్

## ముచ్చటగా మూడోసారి బొజ్జలకు మంత్రి పదవి



అభివృద్ధియే అజెండాగా ప్రజల విశ్వాసమే అండగా అధిష్ఠాన వర్గం నిర్ణయం శిరసావహించటం తన లక్ష్యమని శ్రీకాళహస్తి తెలుగుదేశం ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అన్నారు. తాను రాజకీయ చదరంగంలో ఒక్కో మెట్టు ఎదగడానికి నియోజకవర్గంలోని ఓటర్లే పునాదని, తన రాజకీయ సోపానంలో ఆది నుంచి ఎందరో మిత్రులు చేదోడుగా ఉంటూ వచ్చారని, వారిని ఎన్నటికీ మరువలేనని ఆయన 'లాయర్'కు తెలిపారు.

గుంటూరులో ఆయన ఆదివారం రాత్రి ప్రమాణ స్వీకారం చేయగానే శ్రీకాళహస్తిలో ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బొజ్జల స్వగ్రామమైన శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరులో అత్యంత వైభవంగా సంబరాలు చేసుకున్నారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 1989 – 1992 వరకు శ్రీకాళహస్తీశ్వరాయల ట్రస్టుబోర్డు చైర్మన్‌గా కూడా వ్యవహరించారు. అంతక ముందు 1980లో పి.ఆర్.మాధవరావు అధ్యక్షతన ఏర్పడిన ట్రస్టుబోర్డు సభ్యుడిగా ఉన్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో జన్మించారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి అప్పటి మంత్రి పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి కుమార్తె బొజ్జల బృందమ్మతో వివాహమైంది. ఆయనకు ఒక కుమారుడు బొజ్జల సుధీర్‌రెడ్డి, కోడలు రిషిత రేఖ, కుమార్తె పద్మరేఖలు ఉన్నారు. శ్రీకాళహస్తికి రాష్ట్రంలోనే ప్రముఖ మంత్రిగా రోడ్ల భవనాల శాఖ, డ్వాక్రా, ఉపాధి, నీటిపారుదలశాఖ మంత్రిగా పని చేసి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. తండ్రి బొజ్జల గంగసుబ్బరామిరెడ్డి 1967లో స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం ఆయన కుమారుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 1989లో టిడిపి తరపున రాజకీయ రంగప్రవేశం చేసి నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి ఎన్నో సేవలు అందించారు. అదేబాటలో తనయుడు కూడా శ్రీకాళహస్తి నియోజకవర్గానికే కాకుండా చిత్తూరుజిల్లానే అభివృద్ధి చేశారు. ఆయన విద్యార్థత 1వ తరగతి నుంచి 6వ తరగతి వరకు ఊరందూరు, అక్కడ నుంచి 7వ తరగతి నుంచి 10వతరగతి వరకు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగింది. బిఎస్సీ, బి.ఎల్., చేశారు. 20 సంవత్సరాలు, నాలుగు పర్యాయాలు శాసనసభ్యులుగా గెలుపొంది రెండు పర్యాయాలు మంత్రిగా కొనసాగుతూ 1999 నుంచి 2004 వరకు మంత్రి, ఎమ్మెల్యేగా కొనసాగారు. 2009లో మళ్ళీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 ఎన్నికల్లో తర్వాత ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1996లో తొలిసారిగా మంత్రి పదవి పొంది చిన్ననీటి పారుదల శాఖ, రోడ్లు, భవనాల శాఖను కేటాయించారు. 2001లో మంత్రి ఉపాధి కల్పన, డ్వాక్రా, ఐటీ శాఖలు కేటాయించారు. ప్రస్తుతం ముచ్చటగా మూడోసారి కూడా మంత్రి పదవి లభించింది. ఆయనకు " లాయర్" శుభాకాంక్షలు.

## ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం

### గూడూరులో తెలుగుదేశం పార్టీ సంబరాలు

గూడూరు పట్టణంలో ఆదివారం రాత్రి తెదేపా కార్యకర్తలు సంబరాలు చేసుకొన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకొని గూడూరు పట్టణంలోని పలుకూడళ్లల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు బాణసంచా పేల్చి మిఠాయిలను పంచిపెట్టారు. మున్సిపల్ ఛైర్మెన్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని పొనకా దేవసేన ఆధ్వర్యంలో పట్టణంలోని గడియారపు స్థంభం కూడలి వద్ద



కేక్ కట్ చేస్తున్న చదలవాడ హరిప్రసాద్‌నాయుడు, తదితరులు



మిఠాయిలు పంచిపెడుతున్న మున్సిపల్ ఛైర్మెన్ అభ్యర్థిని పొనకా దేవసేన

సంబరాలు నిర్వహించారు. వివేకానందరోడ్డు వద్దనున్న శ్రీ వెంకటేశ్వర సినీ కాంప్లెక్స్ అధినేత చదలవాడ హరిప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కేక్ కట్‌చేశారు. పట్టణంలోని పలుకూడళ్లలో జరిగిన సంబరాల్లో తెదేపా నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి, కోడూరు శ్రీనివాసులురెడ్డి, బిల్లు చెంచురామయ్య, రమేష్, ఔరంగబాషా, పులిమి శ్రీనివాసులు, రత్నయ్య, మంజులాదేవి, గోనుశివకుమార్, శ్రీహరి, లక్ష్మీనారాయణ, బాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మన్నవరంలో సోలార్ పవర్‌ప్లాంట్

వెంకటగిరి సమీపంలోని మన్నవరం వద్ద నిర్మితమౌతున్న బిహెచ్ఇఎల్ పారిశ్రామిక కేంద్రం ఆవరణలో సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎ.వి.రవీంద్రన్ తెలిపారు. కోట్లాది రూపాయల వ్యయంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని చేపట్టనున్నామని, సౌరశక్తి ఉత్పాదన కేంద్ర మంజూరుకు కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపడం జరిగిందన్నారు. సమీపంలో వెలుగొండ కొండలు వుండడంతో సౌరశక్తి ఉత్పత్తికి ఈ ప్రాంతం ఎంతో అనువుగా వుంటుందని కాబట్టి ఇక్కడ సౌరశక్తి ఉత్పత్తి కేంద్రం నిర్మించాలని తలచినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అనుమతి వచ్చిన వెంటనే సోలార్ పవర్‌ప్లాంట్ నిర్మాణపనులు ప్రారంభిస్తామన్నారు.

## రోటరీ హెల్పేజ్ ఫలసరుకుల పంపిణీ



గూడూరు పట్టణంలోని మఠంవీధిలో వున్న రోటరీ భవనంలో మంగళవారం సాయంత్రం రోటరీ హెల్పేజ్ పథకం క్రింద వృద్ధులకు ఫలసరుకులను మున్సిపల్ కమీషనర్ అనురాధ చేతుల మీదుగా పంపిణీ చేసారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వృద్ధులకు ఆ పథకం క్రింద సరుకులను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు మయూరి శ్యాంయాదవ్, ప్రతినిధులు జానకిరామిరెడ్డి, కె.సుందరరామిరెడ్డి, కృష్ణయ్య, మునిగిరీష్, రఘురామిరెడ్డి, అశోక్, మల్లయ్య, ఎన్.వి.రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుగంగ నీటిని వదలండి...

మాజీ గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ రావు సోమవారం ఆర్డీవో శ్రీనివాసరావును కలసి తెలుగు గంగ నీరు 2టీఎంసీలను కండలేరు ద్వారా 4ఎల్ మేజర్‌కు 1/2టీఎంసి, 2ఎ బ్రాంచ్ కెనాల్‌కు 1/2 టీఎంసీ, స్వర్ణముఖి నది ద్వారా వాకాడు బ్యారేజ్‌కు 1/2టీఎంసి, కోట ఆనకట్టకు 1/2 టీఎంసీ వంతున నీటిని వదలాలని విన్నవించారు. వికలాంగులకు పింఛన్లు ఇవ్వడం లేదని విన్నవించారు. డివిజన్‌లోని ప్రజలు పలు సమస్యలపై ఆర్డీవోను కలసి వినతిపత్రం సమర్పించారు.



ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాదరావు మరియు అర్జీదారులు



# కాటేసిన విధి... కాటికి పంపిన నది

- బియాస్ నదికి 24 నిండు ప్రాణాలు బలి
- హిమాచల్‌ప్రదేశ్‌లో తెలుగు విద్యార్థుల విషాదయాత్ర

*విధి ఎంతో బలీయమైనదంటారు. అవును నిజమే..నంటూ మరో విషాదయాత్ర ఆ మాటను మళ్ళీ రుజువు చేసింది. అయినా, విద్యార్థినీవిద్యార్థులంతా కలసి ఎంతో హుషారుగా విహారయాత్రకు వెళ్ళడమేమిటీ?..సంతోషంతో ఫోటోలు దిగుతున్నప్పుడు వారు ఆ నదిలో విరుచుకుపడిన జలరక్కసికి బలైపోవడమేమిటీ?.అంతా క్షణాల్లో జరిగిపోయింది.*

ఏమిటీ ఘోరం!..నవ్వులు..కేరింతలతో ఆహ్లాదంగా వున్న ఆ విద్యార్థులందరినీ మృత్యువు పొట్టనబెట్టుకుని తన పాశవికత్వాన్ని మరోసారి నిరూపించుకుంది. నదిలో ఆ బండల మీద నిలబడినవారిని నిలబడినట్టే కబళించింది. పరుగులెత్తి ప్రాణాలు దక్కించుకునేవారిని సైతం వదిలిపెట్టక నిలువునా వారి ప్రాణాలను తీసింది. విడిచిన పాదరక్షలు తెచ్చుకునేలోపలే ఒక విద్యార్థినిని నీటికెరటం మింగేసింది. ఆ విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రుల గర్భశోకాన్ని, బంధువులు, ఆత్మీయుల ఆవేదననూ ఎవరు ఆర్చగలరు.. ఎవరు తీర్చగలరు?.. గత ఆదివారం జరిగిన ఈ దారుణ సంఘటనకు రాష్ట్రమే కాదు, దేశవ్యాప్తంగా ప్రజలు చలించిపోయారు. హైదరాబాద్‌లోని విఎన్నార్ విజ్ఞాన్‌జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన కొంతమంది విద్యార్థినీ విద్యార్థులు తమ విజ్ఞానయాత్రలో భాగంగా, ఎంతో ఆహ్లాదంగా వున్న హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి ప్రాంతానికి చేరుకున్నారు. మార్గమధ్యంలో ఆహ్లాదంగా కనిపించిన బియాస్ నదిలోకి దిగారు. నీళ్ళు లేని ఆ నదిలోవున్న బండలపై కూర్చుని నవ్వుకుంటూ హాయిగా ఫోటోలు దిగుతుంటే, ఆ సంతోష దృశ్యాన్ని చూసి మృత్యువు ఓర్చుకోలేకపోయింది. పక్కనే వున్న లార్జిడ్యాం నుంచి నీటిని వదలగానే హటాత్తుగా మృత్యుకెరటమై వచ్చి నదిలో వున్న ఆ విద్యార్థులందరినీ బలితీసుకుంది. ఆ విద్యార్థులంతా తెలుగువారే. ఎంతో తెలివిగలవారే. ఇంజనీరింగ్‌లో ఎంతో ప్రతిభ వున్న ఆ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్తులో మంచి ఉద్యోగాలతో, ఉన్నతస్థాయిలో జీవించేవాళ్ళు. కానీ ఈ లోగానే మృత్యువుకు కన్ను కుట్టింది. ఆ విద్యార్థులపై పగబట్టింది. విద్యార్థులంతా ఆహ్లాదంగా వున్న వేళ, జలఖడ్గంలా వచ్చి వారందరినీ బలితీసుకుంది. మృత్యురాకాసి అలా కాళ్ళ కింద నీరులా వస్తున్న సంగతిని ఆ విద్యార్థులు గుర్తించేలోపే జరగరాని ఘోరం జరిగిపోయింది. క్షణాల్లో అక్కడున్నవారందరూ హాహాకారాలు చేస్తూ నీట మునిగిపోయారు. హటాత్తుగా నదిలోకి విరుచుకుపడిన నీటిప్రవాహం నుంచి తమను తాము రక్షించుకోవాలని, మునిగిపోతున్న తమ స్నేహితులను దక్కించుకోవాలని వారు పడిన తాపత్రయం అంతా ఇంతా కాదు. నదిలో తమతోపాటు కొట్టుకుపోతున్న వారిని రక్షించేందుకు కిరణ్‌కుమార్ అనే విద్యార్థి తన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా నలుగురిని కాపాడాడు. అయితే దురదృష్టవశాత్తూ తాను మాత్రం జలరక్కసికి బలైపోయాడు. మరో విద్యార్థి ఆశిష్ కూడా ఇద్దరు స్నేహితుల ప్రాణాలు కాపాడి, తాను ఒడ్డుకు చేరుకునే సమయంలో ఉధృతంగా వచ్చిన ప్రవాహానికి నీట మునిగిపోయాడు. బస్సు దిగుతుండగా పాదరక్ష తెగిపోవడంతో అదిలాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థి సాయిశ్రీకర్ నదిలోకి రాలేదు. దీంతో ఆ విద్యార్థి ప్రాణం దక్కింది. నదిలో ఒక్కసారిగా వచ్చిన నీటి ప్రవాహాన్ని చూసి వెంటనే ఒడ్డుకుచేరుకున్న ఒక విద్యార్థిని నదిలో రాతిబండల వద్ద పెట్టివున్న తన పాదరక్షలు తీసుకునేందుకు వెళ్ళి, ఉప్పెనలా వచ్చిన నీటి ప్రవాహానికి బలైపోయింది. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో కన్నీటిగాథ. తొలుత పెద్దగా నీరు లేని ఆ నదిలో దిగి, అక్కడున్న పెద్దపెద్ద రాతిబండల మీద కూర్చుని ఫోటోలు దిగుతుండగా మృత్యువు విలయతాండవం చేసినట్లు నీటి ప్రవాహం ఒక్కసారిగా ఉధృతంగా రావడంతో ఈ పెను ప్రమాదం జరిగింది. ఒడ్డునున్న వారు చూస్తుండగానే నదిలో వున్నవారంతా ఆర్తనాదాలు చేస్తూ కనుమరుగైపోయారు. ఈ సమాచారం తెలుసుకున్న వారి తల్లిదండ్రులు పెద్దపెట్టున విలపించారు. తమ బిడ్డలు నదికి బలైపోయారని తెలిసి గుండెలు బాదుకున్నారు. ఈ ఘోరదుర్ఘటన వారి కుటుంబాలను శోకసముద్రంలో ముంచివేసింది. ఈ దారుణ సంఘటనతో తెలుగునేల తల్లడిల్లిపోయింది. ఈ సంఘటన సమాచారం తెలిసిన వెంటనే కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు శరవేగంగా రంగంలోకి దిగాయి. అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నేతలు, ఉన్నతాధికారులు, నాయకులు అప్రమత్తమై ఘటన జరిగిన ప్రాంతం వద్ద తక్షణ చర్యల కోసం సైనికులను రక్షక దళాలను, అధికారులను రంగంలోకి దింపారు. నదిలో గల్లంతైన విద్యార్థినీ విద్యార్థుల మృతదేహాల కోసం తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం నాటికి ఎనిమిది మృతదేహాలను కనుగొన్నారు. మిగిలినవారి మృతదేహాల కోసం ముమ్మర గాలింపు నిర్వహిస్తున్నారు. నీటిప్రవాహానికి కారణమైన లార్జిడ్యాం అధికారులపై చర్యలు తీసుకుంటున్నారు. మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నారు.

ఏదేమైనా, బిడ్డలను కోల్పోయిన ఆ తల్లిదండ్రుల రోదనావేదనలకు అంతే లేదు.. విజ్ఞానయాత్రలు ఇలా విషాదంగా ముగియడం ఘోరం.. దారుణం!.. అయినా.. ఆ పెనువిషాదానికి తల్లడిల్లిపోతున్న తల్లిదండ్రుల బాధను ఎవరు తీర్చగలరూ!..ఏమని ఓదార్చగలరూ!...

# తండ్రి కండక్టర్... తనయుడు మినిష్టర్






'కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు... మహాపురుషులవుతారు' అన్న ప్రముఖ సినీకవి వ్రాసిన పాటను నిజం చేస్తూ ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకున్నా, తన కుటుంబసభ్యులు, తన ముందు తరాల వారు కనీసం పంచాయితీ వార్డు మెంబర్‌గా కూడా పోటీచేసిన చరిత్ర లేకపోయినా కేవలం తన స్వశక్తితో శ్రమశక్తితో ఈరోజు రాష్ట్ర మంత్రి స్థాయికి ఎదిగిన వ్యక్తి నారాయణ విద్యాసంస్థల అధినేత పొంగూరు నారాయణ. ఈ నెల 8వ తేదీన గుంటూరు వద్ద జరిగిన చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవ వేడుకలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నారాయణకు చంద్రబాబు కొలువులో అత్యంత కీలకమైన మున్సిపల్ మరియు అర్బన్ ప్లానింగ్ శాఖను కేటాయించారు.

ఎటువంటి రాజకీయ చరిత్ర లేకుండా చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిపదవిని దక్కించుకున్న ఏకైక వ్యక్తి నారాయణ. ఇంతవరకు కనీసం ఆయన ఏ ఎన్నికల్లో పోటీ చేయలేదు. దాదాపు మూడు దశాబ్దాల కాలంగా నెల్లూరుజిల్లావాసులకు ఆయన ఎంతో సుపరిచితుడు. నిన్నటి ఎన్నికల వరకు కూడా ఆయన జిల్లాకు సంబంధించి ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొన్న దాఖలాలు లేవు. అలాంటి నారాయణ ఈరోజు ఏకంగా మంత్రి అయ్యారు. ఈ జిల్లాకు చెందిన ఆనం రామనారాయణరెడ్డి 30 ఏళ్లు రాజకీయ పోరాటం చేసి 2009లో వై.యస్. కేబినెట్‌లో మున్సిపల్ శాఖ మంత్రి అయితే, ఎటువంటి రాజకీయ పోరాటం లేకుండానే నారాయణ ఈరోజు మున్సిపల్ మంత్రి అయ్యారు.

ఒక వ్యక్తి రాజకీయశక్తిగా ఎదగడానికి తండ్రులు, తాతలు పెద్దపెద్ద నాయకులై ఉండాల్సిన పనిలేదని నారాయణ నిరూపించారు. రాజకీయాలు, పదవులు వారసత్వంగా వచ్చేవి కావని చాటిచెప్పారు. నారాయణ తండ్రి పొంగూరు సుబ్బరామయ్యకు ఎటువంటి రాజకీయ నేపథ్యం లేదు. ఆయన ఓ సాధారణ ప్రైవేట్ బస్ కండక్టర్. నెల్లూరు–పోట్లపూడి మధ్య తిరిగే ప్రైవేట్ బస్సులో ఆయన సుధీర్ఘకాలం కండక్టర్‌గా పనిచేసారు. ఈ రూటులో సుబ్బరామయ్య అంటూ తెలియని వారుండరు. కండక్టర్‌గా పనిచేసినా కలెక్టర్‌గా పనిచేసినంత మంచిపేరు తెచ్చుకున్నాడు. ఓర్పుకు, మర్యాద ప్రవర్తనకు ప్రతిరూపంగా నిలిచేవాడు. ప్రైవేట్ బస్సులను ఎన్టీఆర్ వచ్చాక ప్రభుత్వంలో విలీనం చేసాడు. అప్పటినుండి సుబ్బరామయ్య కండక్టర్ ఉద్యోగం మానుకున్నాడు. తాను కండక్టర్‌గా చేస్తూనే తన కొడుకు నారాయణను కలెక్టర్‌ను చేయాలనుకున్నారాయన. అందుకు ఎంతగానో శ్రమించారు. నారాయణ సివిల్స్ వ్రాసి ఇంటర్వ్యూ వద్ద విఫలమయ్యారు. అయితే అక్కడే నారాయణకు సుడి తిరిగింది. తాను ఐఏఎస్ కాలేకపోయినా ఐఏఎస్‌లను తీర్చిదిద్దే విద్యాకేంద్రాలకు అధిపతి అయ్యాడు. లక్షలాది ఇంజనీర్లు, వేలాదిమంది డాక్టర్లను దేశానికి అందించే విద్యాసంస్థల వ్యవస్థాపకుడయ్యాడు. తన తండ్రి కలలకు తగ్గట్లు ఐఏఎస్ కాలేకపోయినా ఈరోజు ఆ ఐఏఎస్‌లనే తన పిఏస్‌లుగా పెట్టుకునే మినిస్టర్ అయ్యాడు. కాకపోతే తన కొడుకు ఉన్నతస్థానాన్ని చూసి ఉప్పొంగిపోవడానికి మాజీకండక్టర్ సుబ్బరామయ్యే మన మధ్య లేరు.

# నారాయణ విజయోత్సవాలు



ఈ నెల 8వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడుతో పాటూ ఆయన మంత్రివర్గసభ్యుడిగా నారాయణ విద్యాసంస్థల అధినేత పి.నారాయణ ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని నెల్లూరు నర్తకిసెంటర్‌లో భారీఎత్తున వేడుకలు నిర్వహించారు. నారాయణ వైద్యసంస్థల ఏజిఎం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీఎత్తున బాణాసంచాకాల్చి, అందరికీ స్వీట్లు పంచిపెట్టారు.




Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.